**విలేకరులు కావలెను**

**పెన్ సత్తా తెలుగు దినపత్రిక**

ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాప్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.

ఫోన్ నెం : 9885315759

RNI:APTEL/2023/87729

# పెన్ సత్తా

ప్రశ్నించడం అందరి హక్కు...

PEN SATTA Telugu Daily



సంపుటి : 3 | సంచిక : 302 | ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ | బుధవారం 25 మార్చి 2026 | పేజీలు : 08 | వెల : 03

Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool

- ఇరాన్‌పై భారీగా వైమానిక దాడులు
- గల్ఫ్, ఇజ్రాయెల్‌లపై క్షిపణులు, డ్రోన్లను ప్రయోగించిన ఇరాన్
- పర్షియన్ గల్ఫ్‌కు వేల మంది అమెరికా సైనికులు
- ఇరాన్ సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ కార్యదర్శిగా బాఘెర్
- 100 డాలర్లు దాటిన చమురు - కొన్ని దేశాల్లో ఇంధన అత్యయిక స్థితి

# ట్రంప్ నోట చర్చల మాట ..
# ఆగని బాంబుల మోత

దుబాయ్: అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ యుద్ధంలో దాడుల ఉద్ధృతి తీవ్రమైంది. యుద్ధం ముగింపునకు చర్చలు జరుగుతున్నాయని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చెబుతున్నా.. బాంబుల మోత ఏ మాత్రం తగ్గలేదు. చర్చలు జరుగుతున్నాయన్న వాదనలను ఇరాన్ ఖండించింది. 25వ రోజైన మంగళవారం అటు ఇజ్రాయెల్, ఇటు ఇరాన్ బాంబుల వర్షం కురిపించాయి. ఇరాన్, లెబనాన్‌లపై ఇజ్రాయెల్ వైమానిక దాడులతో విరుచుకుపడింది. గల్ఫ్ దేశాలతోపాటు ఇజ్రాయెల్‌పై ఇరాన్ క్షిపణులు, డ్రోన్లను ప్రయోగించింది. మరోవైపు పర్షియన్ గల్ఫ్ దిశగా వేల మంది అమెరికా సైనికులు తరలుతున్నారు. ఇరాన్ సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ కార్యదర్శిగా మహమ్మద్ బాఘెర్ నియమితులయ్యారు. ప్రధాని మోదీతో ట్రంప్ ఫోన్‌లో చర్చలు జరిపారు. పశ్చిమాసియా పరిస్థితిపై చర్చించారు. చర్చలకు ఆతిథ్యమిస్తామని పాకిస్థాన్ ప్రకటించింది. పశ్చిమాసియా యుద్ధం ముగిసే సూచనలు కనిపించకపోవడంతో ముడి చమురు బ్యారెల్ ధర మళ్లీ 100 డాలర్లు

- మిగతా2లో



# 2028కల్లా ప్రతి ఇంటికీ
# సురక్షిత తాగునీరు

- సీఎం చంద్రబాబు వెల్లడి
- జేజేఎం 2.0 ఒప్పంద కార్యక్రమంలో వర్చువల్‌గా పాల్గొన్న ముఖ్యమంత్రి
- మహిళల నీటి కష్టాలు తీరనున్నాయి
- కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్



జలజీవన్ మిషన్(జేజేఎం)లో భాగంగా 2028కల్లా గ్రామాల్లో ప్రతి ఇంటికీ కుళాయిల ద్వారా సురక్షిత తాగునీరు అందించే లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. గ్రామీణ తాగునీటి సరఫరా వ్యవస్థలో ఆపరేషన్, మెయింటెనెన్స్ (ఓఅండ్ఎం)కు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. ఇందుకోసం 2025 సెప్టెంబరులోనే సమగ్ర విధానాన్ని ప్రకటించినట్లు గుర్తుచేశారు. జేజేఎం 2.0పై దిల్లీలో మంగళవారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య అవగాహన ఒప్పందం(ఎంఓయూ) కుదిరింది. కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు క్యాంప్ కార్యాలయం నుంచి వర్చువల్‌గా పాల్గొని మాట్లాడారు. జేజేఎంను 2028 వరకు కొనసాగిస్తూ కేంద్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణయంపై ప్రధాని మోదీకి సీఎం ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



రాష్ట్రంలో తాగునీటి సరఫరా వ్యవస్థల నిర్వహణను పంచాయతీలకు అప్పగించామన్నారు. జేజేఎం అమలులో ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారని చెప్పారు. పోలవరం ప్రాజెక్టును గోదావరి పుష్కరాలకల్లా పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, కేంద్రం సహకరించాలని కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌ను చంద్రబాబు కోరారు.

**లక్ష్యాలను నిర్దేశించుకుందాం**

'జేజేఎం 2.0పై త్వరలో ఏపీలో కలెక్టర్లతో వర్చువల్ సమావేశం ఏర్పాటు చేస్తే లక్ష్యాలను నిర్దేశించుకుందాం. పీఎం జన్‌మన్, పీఎం జన్ భాగీదారీ మిషన్‌లో భాగంగానూ సురక్షిత నీటిని మారుమూల ప్రాంతాలకు

- మిగతా2లో

# పైపులు తగలబడిన ఘటన వెనక విద్రోహ చర్య

**చిన్న నిప్పురవ్వ అంటుకుంటే ఇంత ప్రమాదం జరగదు**

**వరుస ఘటనల వెనక కుట్ర కోణం**

**ఫోరెన్సిక్ ఆధారాలతో 24 గంటల్లోగా నిగ్గుతేల్చాలి**

**డీజీపీ, ఇతర పోలీసు అధికారులకు సీఎం ఆదేశం**



రాజధాని అమరావతిలో తాజాగా పైపులు తగలబడిన ఘటన వెనక విద్రోహచర్య ఉన్నట్లు స్పష్టంగా కనిపిస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. 130-140 డిగ్రీల వేడితో నిప్పు అంటిస్తే తప్ప పైపులు తగలబడవంటూ నిపుణులు చెబుతున్నారని, దీన్నిబట్టి

- మిగతా2లో



## విదేశాంగ విధానం మోదీ వ్యక్తిగతంగా మారింది

దిల్లీ: మన విదేశాంగ విధానం ప్రధాని నరేంద్రమోదీ వ్యక్తిగతంగా మారిపోయిందని, అంతర్జాతీయ జోక్‌గా మిగిలిందని లోక్‌సభలో విపక్షనేత రాహుల్‌గాంధీ ఎద్దేవా చేశారు. పార్లమెంటు ఆవరణలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. "మోదీ ఏం చేయగలరో, ఏం చేయలేరో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు కచ్చితంగా

- మిగతా2లో

## అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయట్లే.. డీఎంకేకు మద్దతు ఇస్తాం

**కమల్ హాసన్ కీలక ప్రకటన**



చెన్నై: తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీపై మక్కల్ నీది మైయం చీఫ్, రాజ్య సభ ఎంపీ కమల్ హాసన్ కీలక ప్రకటన చేశారు. రాబోయే తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో తన మక్కల్ నీది మైయం పార్టీ పోటీ చేయదని ప్రకటించారు.

- మిగతా2లో

## ఏపీలో పలు జిల్లాలకు పిడుగుల హెచ్చరిక..
## గంటకు 50 కి.మీ వేగంతో గాలులు

- ద్రోణి ప్రభావంతో ఏపీలో రానున్న మూడు రోజులు వర్షాలు
- పలు జిల్లాల్లో పిడుగులు, బలమైన ఈదురు గాలులతో కూడిన వర్ష సూచన
- గంటకు 50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం
- వర్షాలు కురిసినా 2 నుంచి 3 డిగ్రీల మేర పెరగనున్న ఉష్ణోగ్రతలు

ద్రోణి ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో రానున్న మూడు రోజుల పాటు పలు ప్రాంతాల్లో తేలిక పాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని అమరావతి వాతావరణ

- మిగతా2లో



## ఇది తెదేపా 3.0 వెర్షన్

- క్షేత్రస్థాయిలో పనిచేసే వారికే గుర్తింపు
- ఈ పార్టీ నాయకుల కార్ఖానా



ఇప్పుడు ఉన్నది తెదేపా 3.0 వెర్షన్ అని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి లోకేశ్ అన్నారు. తెదేపా అంటేనే నాయకుల తయారీ కార్ఖానా, ఒక యూనివర్సిటీ లాంటిదని తెలిపారు. తెలంగాణ తొలి, రెండో ముఖ్యమంత్రి ఇద్దరిదీ ఈ యూనివర్సిటీయేనని గుర్తు చేశారు. మంగళగిరిలోని తెదేపా ప్రధాన కార్యాలయంలో పార్టీ క్లస్టర్ ఇన్‌ఛార్జ్‌ల శిక్షణా

- మిగతా2లో



## ప్రధాని మోదీకి ట్రంప్ ఫోన్..
## 'హర్మూజ్'పై కీలక చర్చ

అమెరికా- ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య యుద్ధం వేళ ప్రధాని నరేంద్ర మోదీ కి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఫోన్ చేశారు. పశ్చిమాసియాలో కొనసాగుతున్న పరిస్థితులపై ఇరువురు నేతలు చర్చించారు. అలాగే, హర్మూజ్

- మిగతా2లో

## మతం మారితే ఎస్సీ హోదా కోల్పోయినట్లే

**క్రైస్తవ మతంలోకి వెళ్లిన వ్యక్తులు ఎస్సీల కిందకు రారు**

**హిందువులు, బౌద్ధులు, సిక్కులకే ఆ హోదా**

**బాపట్ల జిల్లా పాస్టర్ కేసులో సుప్రీంకోర్టు తీర్పు**

క్రైస్తవ మతంలోకి మారి దాని గురించి క్రియాశీలకంగా బోధిస్తూ, పాటించే వ్యక్తులు ఎస్సీల కిందికి రారని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈ అంశంపై ఆంధ్రప్రదేశ్ హైకోర్టు 2025 ఏప్రిల్ 30న ఇచ్చిన తీర్పును సమర్థిస్తూ జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్ర, జస్టిస్ మన్మోహన్‌లతో కూడిన ధర్మాసనం మంగళవారం తీర్పు వెలువరించింది. హిందు, బౌద్ధ, సిక్కు మతాలు మినహా ఏ మతాలవారూ ఎస్సీల కిందికి రారని

- మిగతా2లో



# 2028కల్లా ప్రతి ఇంటికీ సురక్షిత తాగునీరు

-మొదటిపేజీ తరువాయి
అందించేందుకు నిధులు వినియోగించుకోవాలని కోరుతున్నా. ప్రధాని మోదీని సీఎం చంద్రబాబు పలుమార్లు సంప్రదించి జేజేఎం పొడిగింపును ప్రతిపాదించినందుకు ధన్యవాదాలు' అని పాటిల్ అన్నారు.

**కుళాయిల నిర్వహణ బలోపేతం**

దిల్లీలోని కేంద్ర జలవనరుల మంత్రిత్వశాఖ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో జేజేఎం 2.0 ఒప్పంద పత్రాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు సంతకాలు చేశారు. ఈ ఎంఓయూతో మౌలిక సదుపాయాల కల్పన, పంచాయతీల ఆధ్వర్యంలో తాగునీటి కుళాయిల నిర్వహణ వ్యవస్థ బలోపేతం కానుంది. ఒప్పందం ద్వారా 2028 డిసెంబరుకు 'హర్ ఘర్ జల్' సాకారం చేయాలనేది లక్ష్యం. కార్యక్రమంలో కేంద్ర జలశక్తి కార్యదర్శి అశోక్‌కుమార్ మీనా, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ముఖ్యకార్యదర్శి శశిభూషణ్‌కుమార్ తదితర ఉన్నతాధికారులు హాజరయ్యారు. అమరావతి నుంచి ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ వర్చువల్‌గా పాల్గొని మాట్లాడారు.

**మరిన్ని నిధులు కేటాయించాలి**

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దృష్ట్యా జలజీవన్ మిషన్‌కు కేంద్ర ప్రభుత్వం మరిన్ని నిధులు కేటాయించాలని పవన్‌కల్యాణ్ కోరారు. 'జేజేఎం ద్వారా ప్రతి గ్రామంలో, ప్రతి ఇంటికీ కుళాయిల ద్వారా తాగునీరు అందించే ప్రణాళికలతో ముందుకు వెళుతున్నాం. వైకాపా ప్రభుత్వ హయాంలో అశాస్త్రీయమైన ప్రాజెక్టు నివేదికల ఆధారంగా మంజూరైన నిధులతో పూర్తిస్థాయి లక్ష్యాలు చేరుకోవడం అసాధ్యం. కేంద్రం నుంచి వచ్చిన మొత్తం నిధుల్ని ఖర్చు చేసినా 13 లక్షల గృహాలు తాగునీటి సరఫరాకు దూరంగా ఉండిపోతాయి. లక్ష్యాలు చేరుకునేందుకు కేంద్రం సహకరించాలి' అని విజ్ఞప్తి చేశారు.

**డ్వాక్రా సభ్యులకు అప్పగించాలి**

జేజేఎం మొదటి దశలో దేశవ్యాప్తంగా 16 కోట్ల ఇళ్లకు కుళాయి కనెక్షన్లు ఇచ్చామని సీఆర్ పాటిల్ దిల్లీ నుంచి వర్చువల్‌గా మాట్లాడుతూ చెప్పారు. 'మరో 3 కోట్ల ఇళ్లకు సురక్షిత తాగునీటిని అందించాలి. ఏపీలో నీటి నాణ్యత పరీక్షలకు డ్వాక్రా మహిళల సేవలు వినియోగించుకోవాలి. జేజేఎం 2.0 ద్వారా ఏపీలో ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్ ఇచ్చి సురక్షిత నీటిని అందించాలనే లక్ష్యం త్వరలో నెరవేరుతుంది. దేశంలో 9 కోట్ల మంది మహిళలు దూరం నుంచి నీరు తెచ్చుకునే కష్టాలు తప్పుతాయి' అని ఆయన చెప్పారు.

# పైపులు తగలబడిన ఘటన వెనక విద్రోహ చర్య

-మొదటిపేజీ తరువాయి
చూస్తే చిన్న నిప్పురవ్వ అంటుకుంటే అంత ప్రమాదం జరిగే అవకాశమే లేదని పేర్కొన్నారు. 24 గంటల్లోగా ఘటనకు కారణాలు వెలికితీసి తనవద్దకు రావాలని డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా, గుంటూరు ఎస్పీ వకుల్ జిందాల్‌ను ఆదేశించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి అమరావతి ప్రాంతంలో ఇలాగే మూడు అగ్ని ప్రమాదాలు జరిగాయని.. వాటన్నింటినీ లింక్ చేసి దర్యాప్తుచేస్తే వాస్తవాలు బయటకు వస్తాయని, ఆ కోణంలో ముందుకెళ్లాలని సూచించారు. రాయపూడిలో హెచ్‌ఓడీ టవర్లు నిర్మిస్తున్న సంస్థ పైపులు సోమవారం అర్ధరాత్రి దగ్ధమైన ఘటనపై డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా, నిఘా విభాగాధిపతి మహేష్‌చంద్ర లడ్డా, గుంటూరు ఎస్పీ వకుల్ జిందాల్‌లతో సీఎం చంద్రబాబు మంగళవారం సమీక్షించారు. ఘటనపై అధికారులు ముఖ్యమంత్రికి నివేదిక సమర్పించారు.

**ఫోరెన్సిక్ ఆధారాలతో నిగ్గు తేల్చాలి**

సీఎం మాట్లాడుతూ.. మంటలు వేగంగా వ్యాప్తి చెందడానికి కారణాలేంటని ప్రశ్నించారు. ఫోరెన్సిక్ ఆధారాల ద్వారా నిగ్గుతేల్చాలని సూచించారు. 'కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక రాజధానిలో వరుసగా అగ్నిప్రమాదాలు జరుగుతున్నాయి. వాటి తీరు చూస్తే కుట్రకోణం ఉన్నట్లు అనిపిస్తోంది. గతంలో జరిగిన కొన్ని ఘటనలు, ఇప్పుడు రాజధాని ప్రాంతంలో జరుగుతున్న ప్రమాదాలను దృష్టిలో పెట్టుకుని కుట్రకోణాన్ని విశ్లేషించి వాస్తవాలు బయటకు తీయాలి' అని ఆదేశించారు. అలజడి సృష్టించాలని ఎవరైనా ప్రయత్నిస్తున్నట్లు తేలితే కఠిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

**సామగ్రి నిల్వ చేసుకునే యార్డుల్లో సీసీ కెమెరాలు**

"రాజధాని నిర్మాణపనులు వేగంగా జరుగుతున్నాయి. రూ.కోట్ల విలువైన సామగ్రిని నిల్వచేసి పెట్టారు. ఇలాంటి ఘటనల వల్ల అనవసరమైన అడ్డంకులు ఏర్పడతాయి. నిర్మాణపనులు జరుగుతున్న ప్రదేశాల్లో అదనపు గస్తీ నిర్వహించాలి. ప్రతి నిర్మాణ సంస్థ యార్డుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి. భద్రతా సిబ్బందిని పెట్టుకోవాలి. డ్రోన్ కెమెరాల ద్వారా ఆయా ప్రాంతాల్లో భద్రతను పర్యవేక్షించాలి. అనుమానితుల కదలికలపై నిఘాపెట్టాలి. వారి రాకపోకలు గమనించాలి' అని చంద్రబాబు ఆదేశించారు.

# ట్రంప్ నోట చర్చల మాట .. ఆగని బాంబుల మోత

-మొదటిపేజీ తరువాయి
దాటింది. యుద్ధం కారణంగా ఖతార్‌లో జరగాల్సిన పాప్ గాయని షకీరా సంగీత కచేరీ వాయిదా పడింది. యుద్ధంతో ఐరోపా పర్యాటకంపై భారీ దెబ్బ పడింది.

అమెరికా కాల్పుల విరమణకు అంగీకరించినా.. తాము ఇరాన్, లెబనాన్‌లపై దాడులను కొనసాగిస్తామని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ప్రకటించారు.

ఇరాన్‌తో చర్చలు జరుగుతున్నాయని వాషింగ్టన్‌లో అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. విస్తృత ఒప్పందం కుదిరే అవకాశముందని తెలిపారు. ఇరాన్ ముందు అమెరికా 15 డిమాండ్లను ఉంచినట్లు సమాచారం. అయితే ఇరాన్ అధికారులు దీనిని ఖండించారు.

ఇరాన్ దాడులను ఎదుర్కొనేందుకు గల్ఫ్ దేశాలకు స్వల్ప శ్రేణి గగనతల రక్షణ వ్యవస్థలను పంపుతున్నామని బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ తెలిపారు.

**ఆయుధ ఉత్పత్తి కేంద్రాలపై..**

ఇరాన్‌లోని ఆయుధ ఉత్పత్తి కేంద్రాలపై ఇజ్రాయెల్ వరుస దాడులు చేసింది. టెహ్రాన్ ఉత్తర ప్రాంతంలో భారీ పేలుడు శబ్దం వినిపించింది. మరో పేలుడు నగరం మధ్యలో చోటుచేసుకుంది. ఇప్పటిదాకా జరిగిన దాడుల్లో 82,000 భవనాలు దెబ్బతిన్నాయి. లెబనాన్ రాజధాని బీరుట్ దక్షిణ ప్రాంతంపై ఇజ్రాయెల్ బాంబుల వర్షం కురిపించింది. హెజ్‌బొల్లా మిలిటెంట్ గ్రూపు మౌలిక వసతులను లక్ష్యంగా చేసుకుని ఈ దాడులు చేసింది. బీరుట్ ఆగ్నేయ ప్రాంతంలోని ఓ అపార్ట్‌మెంట్‌పై జరిగిన దాడిలో ముగ్గురు మరణించారు. దక్షిణ ప్రాంతంలో మరో ఐదుగురు మృతి చెందారు.

దేశం వీడి వెళ్లాలని ఇరాన్ రాయబారిని లెబనాన్ ప్రభుత్వం ఆదేశించింది.

**సిటీ సెంటర్‌లో..**

ఇరాన్ ప్రయోగించిన 100 కిలోగ్రాముల వార్‌హెడ్‌తో కూడిన క్షిపణి ఇజ్రాయెల్‌లోని టెల్ అవీవ్ సిటీ సెంటర్‌లో పడింది. అది పేలడంతో చుట్టుపక్కల ఇళ్లు, అపార్ట్‌మెంట్ల కిటికీలు ధ్వంసమయ్యాయి. ఉత్తర ఇజ్రాయెల్‌పై జరిగిన దాడిలో 30 ఏళ్ల మహిళ మరణించారు. కువైట్‌లో క్షిపణి శకలం కారణంగా విద్యుత్తు లైన్లు దెబ్బతిన్నాయి. దీంతో పలు గంటలపాటు విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలిగింది. బహ్రెయిన్‌పై క్షిపణులు, డ్రోన్లతో దాడులు జరిగాయి. పలుమార్లు సైరన్లు మోగాయి. బహ్రెయిన్‌లోని తమ వెబ్ సర్వీసెస్‌లో అంతరాయం ఏర్పడినట్లు ప్రముఖ ఇ-కామర్స్ దిగ్గజం అమెజాన్ పేర్కొంది.

క్షిపణులను అడ్డుకున్నామని యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) వెల్లడించింది.

తూర్పు ప్రాంతంలోని చమురు క్షేత్రాలపైకి ఇరాన్ ప్రయోగించిన డ్రోన్లను సౌదీ అరేబియా అడ్డుకుంది. 20 డ్రోన్లు తమ దేశంపైకి దూసుకొచ్చాయని సౌదీ తెలిపింది.

**ఖర్గ్‌ను సీజ్ చేయడానికి..**

పశ్చిమాసియాకు వేల మంది అమెరికా మెరీన్లు బయలుదేరారు. ఇరాన్ చమురు నెట్‌వర్క్‌కు కీలకమైన ఖర్గ్ ద్వీపాన్ని సీజ్ చేయడానికి అమెరికా ఈ సేనలను పంపుతున్నట్లు సమాచారం.

**లారిజానీ స్థానంలో..**

సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ కార్యదర్శిగా మహమ్మద్ బాఘెర్ జోల్ఘదర్ నియమితులయ్యారు. ఇటీవల ఇజ్రాయెల్, అమెరికా దాడుల్లో మరణించిన లారిజానీ స్థానంలో ఆయనను ఇరాన్ ప్రభుత్వం నియమించింది. బాఘెర్.. ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ కోర్ (ఐఆర్‌జీసీ) మాజీ కమాండర్.

**మేం సిద్ధం: పాక్**

ఇరాన్ యుద్ధాన్ని ముగించడానికి జరిగే నిర్మాణాత్మక చర్చలకు ఆతిథ్యం ఇస్తామని పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ప్రకటించారు. తాను ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్‌తో మాట్లాడినట్లు ఎక్స్‌లో వెల్లడించారు. పాక్‌లో చర్చలు జరపడానికి అమెరికా సూత్రప్రాయంగా అంగీకరించిందని ముగ్గురు అధికారులు తెలిపారు. షరీఫ్ ప్రకటనను ట్రంప్ తన సామాజిక మాధ్యమ వేదిక ట్రూత్ సోషల్‌లో పంచుకున్నారు.

**మార్కెట్లలో ఊగిసలాట**

ప్రపంచ స్టాక్ మార్కెట్లను యుద్ధం అతలాకుతలం చేస్తోంది. తొలుత మార్కెట్లలో ర్యాలీ సాగినా.. ఆ తర్వాత చమురు ధరలు పెరగడంతో మళ్లీ తగ్గిపోయాయి. ఎరువుల ఎగుమతులపై చైనా నియంత్రణ విధించింది. జపాన్‌లో ఇంధన అత్యవసర పరిస్థితి తలెత్తింది. ఫిలిప్పీన్స్‌లో ఇంధన అత్యవసర పరిస్థితిని అధ్యక్షుడు ఫెర్డినాండ్ మార్కోస్ జూనియర్ ప్రకటించారు.

ఇంధన, నీటి మౌలిక వసతులపై దాడులు చేస్తే తామూ యుద్ధంలో పాల్గొనాల్సి వస్తుందని సౌదీ అరేబియా, యూఏఈ హెచ్చరించినట్లు వార్తలొస్తున్నాయి.

అమెరికాతో చర్చలకు ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ సిద్ధమయ్యారంటూ ఇజ్రాయెలీ మీడియా సంస్థ వెల్లడించింది. ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ, పశ్చిమాసియాలోని అమెరికా ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్‌కాఫ్ మధ్య జరిగిన తాజా సంభాషణలో ఈ అంశం ప్రస్తావనకు వచ్చిందని వెల్లడించింది.

# మతం మారితే ఎస్సీ హోదా కోల్పోయినట్లే

-మొదటిపేజీ తరువాయి
స్పష్టం చేసింది. ఈ మూడు మతాలు మినహాయించి ఇతర మతాల్లోకి మారినవారు వెంటనే ఎస్సీ హోదాను కోల్పోతారని పేర్కొంది. షెడ్యూల్డ్ కులాల వ్యక్తులు క్రైస్తవంలోకి మారిన రోజే ఎస్సీ హోదా కోల్పోతారంటూ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ బాపట్ల జిల్లా పిట్టలవానిపాలెం మండలం కొత్తపాలెం గ్రామానికి చెందిన చింతాడ ఆనంద్ దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు గత ఏడాది ఆగస్టు 26న విచారణ ముగించి తీర్పు రిజర్వ్ చేసింది. మంగళవారం దాన్ని వెలువరించింది.

'ఎస్సీల కిందికి ఎవరు వస్తారన్నది రాజ్యాంగ (ఎస్సీ) ఉత్తర్వులు- 1950లో స్పష్టంగా ఉంది. ఆ ఉత్తర్వుల్లోని క్లాజ్ 3లో పేర్కొన్న మతాలు మినహాయించి మిగిలిన ఏ మతంలోకి మారినా పుట్టుకతో సంబంధం లేకుండా ఆటోమేటిక్‌గా ఎస్సీ హోదా పోతుంది. అలాంటివారు ఎలాంటి చట్టబద్ధమైన ప్రయోజనాలు, రక్షణలు, రాజ్యాంగం, పార్లమెంటు, శాసనసభలు చేసిన చట్టాల కింద పొందుపరిచిన రిజర్వేషన్లు, హక్కులు, ప్రాధాన్యతలు పొందలేరు. క్లాజ్-3లో పేర్కొన్న మతాలను కాదని ఇతర మతాలను అనుసరిస్తూ మరోవైపు తాము షెడ్యూల్డ్ కులాలవారమని చెప్పుకోకూడదు. వ్యక్తిగత, సామాజిక, ఆధ్యాత్మిక ప్రయోజనాల కోసం ఒక మతాన్ని అనుసరిస్తూ మరోవైపు చట్టబద్ధమైన ప్రయోజనాల కోసం షెడ్యూల్డ్ కులాలకు చెందినవారిగా చెప్పుకోవడం కుదరదు. ఈ రెండు వాదనలూ పరస్పర విరుద్ధం. రాజ్యాంగ సూత్రాలకు వ్యతిరేకం. ఈ కేసులో పిటిషనర్ ఎస్సీ కులంలో పుట్టి, తర్వాత క్రైస్తవంలోకి మారారన్నది నిర్వివాదం. మతం మారినా కులాన్ని అలాగే ఉంచుకోవడం ఆమోదయోగ్యం కాదు. పిటిషనర్ క్రైస్తవంలోకి మారి దశాబ్ద కాలంగా పాస్టర్‌గా పనిచేస్తూ గ్రామంలోని పలు ఇళ్లలో ప్రతి ఆదివారం ప్రార్థనలు నిర్వహిస్తున్నట్లు స్పష్టమైన ఆధారాలున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో కేవలం కులధ్రువీకరణ పత్రం చూపినంత మాత్రాన ప్రయోజనం ఉండదు. పిటిషనర్ క్రైస్తవంలోకి మారి, మళ్లీ సొంత మతం స్వీకరించినట్లు నిరూపించలేకపోయినందున అతని షెడ్యూల్డ్ కుల సభ్యత్వం రద్దయినట్లే.

**ఇదీ నేపథ్యం**

2021 జనవరి 24న కొత్తపాలెం గ్రామంలోని ఓ ఇంట్లో ఆదివారం ప్రార్థనలు నిర్వహించి తిరిగి వెళ్తుండగా అక్కల రామిరెడ్డి, వెంకటరెడ్డి, లక్ష్మారెడ్డి, నాగార్జునరెడ్డి, మణికంఠరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి మరో 25 మంది అడ్డుకొని దాడి చేయడంతోపాటు కులంపేరుతో దూషించినట్లు చింతాడ ఆనంద్ చందోల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దాని ఆధారంగా పోలీసులు ఎస్సీ, ఎస్టీ ఎట్రాసిటీ చట్టంలోని వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. విచారణ జరిపి ఇరువర్గాల కులాలను తహసీల్దార్ ద్వారా ధ్రువీకరించుకున్న తర్వాత 2021 ఏప్రిల్ 30న ఛార్జిషీట్ దాఖలు చేశారు. అయితే క్రైస్తవ మతంలోకి మారిన వ్యక్తికి ఎస్సీ హోదా వర్తించదని, అందువల్ల ఆయన ఫిర్యాదు ఆధారంగా ఎస్సీ, ఎస్టీ ఎట్రాసిటీ చట్టం కింద తమపై నమోదు చేసిన కేసును కొట్టేయాలని నిందితులు సీఆర్‌పీసీ సెక్షన్ 482 కింద హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. వారి వాదనలను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు ఆరుగురిపై నమోదు చేసిన క్రిమినల్ కేసులను కొట్టేస్తూ 2025 ఏప్రిల్ 30న తీర్పు వెలువరించింది. క్రైస్తవ మతంలో కులవ్యవస్థ లేదని, మతం మారి క్రైస్తవాన్ని బోధించడంతోపాటు, పాస్టర్‌గా క్రియాశీలకంగా వ్యవహరిస్తున్న వ్యక్తి ఎస్సీ, ఎస్టీ చట్టం కింద రక్షణ పొందలేరని స్పష్టం చేసింది. ఆ తీర్పును సవాల్ చేస్తూ ఆనంద్ 2025 మే 14న సుప్రీంకోర్టులో ఎస్‌ఎల్‌పీ దాఖలు చేశారు.

ఈ 3 నిబంధనలు పాటిస్తేనే సొంత మతంలోకి తిరిగివచ్చినట్లు..

ఎవరైనా ఒక వ్యక్తి రాజ్యాంగ (షెడ్యూల్డ్ కులాలు) ఉత్తర్వులు-1950లోని క్లాజ్ 3లో లేని మతాన్ని స్వీకరించి తిరిగి హిందు, సిక్కు, బౌద్ధ మతాల్లోకి మారాలనుకుంటే 3 నిబంధనలను తప్పనిసరిగా పాటించాలి.

1. తాను క్లాజ్-3లో పేర్కొన్న కులం వ్యక్తినని స్పష్టమైన ఆధారాలు చూపాలి.
2. తొలుత స్వీకరించిన మతాన్ని పూర్తిగా త్యజించినట్లు, తన వాస్తవ మతంలోకి మళ్లీ మారానని చెప్పడానికి విశ్వసనీయమైన, బలమైన ఆధారాలు చూపాలి.
3. ఆ వ్యక్తి తిరిగి సొంత మతాన్ని స్వీకరించిన విషయాన్ని ఆ కులంవారు ధ్రువీకరించి, తమలో ఒకరిగా స్వీకరించారని నిరూపించే సంతృప్తికరమైన, విశ్వసనీయమైన ఆధారాలు ఉండాలి. కేవలం స్వీయప్రకటన సరిపోదు.

ఇందులో ఏ ఒక్క షరతును నిరూపించలేకపోయినా వారి క్లెయిమ్ నిలవదు.

# విదేశాంగ విధానం మోదీ వ్యక్తిగతంగా మారింది

-మొదటిపేజీ తరువాయి
తెలుసు. ప్రధాని రాజీపడితే, మన విదేశాంగ విధానం కూడా రాజీపడినట్లే. ఆయన నిన్న పార్లమెంటులో ఏమాత్రం సంబంధం లేని ప్రసంగం చేశారు. పరిస్థితి కొవిడ్‌లాగా ఉంటుందని మోదీ అంటున్నారు. కానీ కరోనా సమయంలో ఎంతమంది చనిపోయారో, ఎన్ని విషాదాలు జరిగాయో ఆయన మర్చిపోయారు. మోదీ ప్రధాని. ఆయన దానికి తగ్గట్టుగా ఉండాలి. కానీ అలా ఉండటం లేదు. దేశానికి అది హానిచేయనుంది. ఎల్పీజీ, పెట్రోలు, ఎరువులు.. ఇవన్నీ సమస్య కానున్నాయి. ప్రభుత్వం ఇలాంటివి అర్థం చేసుకోలేకపోతోంది. అమెరికా, ఇజ్రాయెల్ ఎలా చెబితే మోదీ అలా చేస్తారని, దేశప్రయోజనాల కోసం కృషి చేయరని నేను రాతపూర్వకంగా చెప్పగలను" అని పేర్కొన్నారు. ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల రాజ్యాంగబద్ధ హక్కులపై, వారి అస్థిత్వంపై ప్రభుత్వం సంకుచిత బుద్ధితో దాడి చేస్తోందని ఆరోపించారు.

శాసనసభ ఎన్నికల్లో భాజపా తరఫున పోటీచేయడానికి వీలుగా అస్సాంకు చెందిన కాంగ్రెస్ ఎంపీ ప్రద్యుత్ బార్డోలోయి ఇచ్చిన రాజీనామాను లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా ఆమోదించారు.

దేశంలో రైతుల ఆదాయం రెట్టింపు అయిందని వ్యవసాయ- రైతు సంక్షేమ శాఖమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ లోక్‌సభ ప్రశ్నోత్తరాల సమయంలో తెలిపారు.

**ర్యాబిస్ టీకాల కొరత లేదు: నడ్డా**

దేశంలో ఎక్కడా యాంటీ-ర్యాబిస్ వ్యాక్సిన్‌కు కొరత లేదని కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జె.పి.నడ్డా రాజ్యసభలో తెలిపారు. అందువల్ల ఎగుమతిని ఆపేయాల్సిన అవసరమేమీ లేదని స్పష్టంచేశారు. దేశంలో జంతువుల కాట్ల కేసులు ఏటా 58 లక్షలు ఉండగా వాటిలో 47 లక్షల కేసులు కుక్కకాట్లేనని చెప్పారు.

# అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయట్లే.. డీఎంకేకు మద్దతు ఇస్తం

-మొదటిపేజీ తరువాయి
అసెంబ్లీ ఎన్నికల్లో అధికార డీఎంకే పార్టీకి మద్దతు ఇస్తామని తెలిపారు.

మంగళవారం (మార్చి 24) డీఎంకే చీఫ్, సీఎం స్టాలిన్?తో కమల్ హాసన్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా అసెంబ్లీ ఎన్నికల్లో పోటీపై ఇరువురు చర్చించారు. ఈ భేటీ అనంతరం.. ఎన్నికల్లో పోటీ చేయకుండా డీఎంకేకు మద్దతు ఇవ్వాలని కమల్ హాసన్ నిర్ణయించుకున్నారు. కాగా, డీఎంకే కూటమి మద్దతుతో కమల్ హాసన్ రాజ్య సభ ఎంపీగా ఏకగ్రీవంగా ఎన్నికైన విషయం తెలిసిందే.

**యాక్టర్ టూ పొలిటిషియన్:**

అవినీతి, గ్రామీణాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ వంటి లక్ష్యాలతో ప్రముఖ నటుడు కమల్ హాసన్ 2017లో మక్కల్ నీది మైయం పార్టీ స్థాపించి రాజకీయ రంగ ప్రవేశం చేశారు. 2019 లోక్‌సభ ఎన్నికలలో ఎంఎన్‌ఎం పోటీ చేసి మొత్తం ఓట్లలో సుమారు నాలుగు శాతం వాటాను సాధించి తమిళ రాజకీయాల్లో ఉనికి చాటుకుంది.

2021 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలలో కూడా ఎంఎన్‌ఎం బరిలోకి దిగింది. ఆ పార్టీ చీఫ్ కమల్ హాసన్ కోయంబత్తూరు దక్షిణ నియోజకవర్గం నుంచి పోటీ చేసి బీజేపీ అభ్యర్థి వనతి శ్రీనివాసన్ చేతిలో స్వల్ప తేడాతో ఓడిపోయారు. ఇక, 2024 పార్లమెంట్ ఎన్నికల్లో పోటీకి ఎంఎన్‌ఎం దూరంగా ఉంది. ఈ ఎన్నికల్లో డీఎంకే పార్టీకి కమల్ హాసన్ మద్దతు ప్రకటించారు.

**తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు 2026:**

మొత్తం 234 అసెంబ్లీ స్థానాలున్న తమిళనాడులో 2026, ఏప్రిల్ 23న అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. మే 4న ఓట్ల లెక్కింపు, ఫలితాలు విడుదల కానున్నాయి. తమిళనాడులో ఈసారి త్రిముఖ పోరు నెలకొంది. డీఎంకే, అన్నాడీఎంకే, విజయ్ టీవీకే పార్టీ మధ్య తీవ్రమైన పోటీ నెలకొంది.

# ఇది తెదేపా 3.0 వెర్షన్

-మొదటిపేజీ తరువాయి
తరగతుల్లో భాగంగా 'కాఫీ కబుర్లు' కార్యక్రమంలో లోకేశ్ మాట్లాడారు. క్షేత్రస్థాయిలో పార్టీ కోసం పనిచేసే వారిని మధ్యవర్తులతో సంబంధం లేకుండా నేరుగా గుర్తించే లక్ష్యంతో పనిచేస్తున్నామని వెల్లడించారు. పార్టీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు చుట్టూ కోటరీ లేదని, అన్ని విషయాలనూ ఆయన నేరుగా తెలుసుకుంటున్నారని చెప్పారు. ఈ నెల 29న నిర్వహించే పార్టీ ఆవిర్భావ వేడుకల్లో వేదికపై పార్టీ జాతీయ అధ్యక్షుడితో పాటు 'మై టీడీపీ' యాప్, క్లస్టర్, మండల పార్టీ అధ్యక్షులు, అనుబంధ విభాగాల నుంచి రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలిచిన 19 మంది కార్యకర్తలను గుర్తించి వేదికపై కూర్చొనే అవకాశం కల్పిస్తామని లోకేశ్ ప్రకటించారు.

# ఏపీలో పలు జిల్లాలకు పిడుగుల హెచ్చరిక.. గంటకు 50 కి.మీ వేగంతో గాలులు

-మొదటిపేజీ తరువాయి
కేంద్రం తెలిపిం ది. కొన్ని జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో పాటు బలమైన ఈదురుగాలులు వీస్తాయని హెచ్చరించింది. మరోవైపు రానున్న ఐదు రోజుల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు కూడా 2 నుంచి 3 డిగ్రీల మేర పెరిగే అవకాశం ఉందని పేర్కొంది.వాతావరణ కేంద్రం అంచనాల ప్రకారం ఈ రోజు శ్రీకాకుళం, విజయనగరం, అల్లూరి సీతారామరాజు, తూర్పుగోదావరి, ఏలూరు, పశ్చిమగోదావరి, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు, బాపట్ల, కర్నూలు, అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల్లో పిడుగులతో కూడిన వర్షాలు పడవచ్చు. ఈ సమయంలో గంటకు 50 కిలోమీటర్లకు చేరవచ్చని అధికారులు వెల్లడించారు. మరో వైపు రాబోయే ఐదు రోజుల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 2 నుంచి 3 డిగ్రీలు పెరుగుతాయని వాతావరణ శాఖ అంచనా వేసింది. వర్ష సూచన నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్ డీఎంఏ) ప్రజలను, ముఖ్యంగా రైతులను అప్రమత్తం చేసింది. పొలాల్లో పనిచేసే రైతులు, పశువుల కాపరులు పిడుగుల పట్ల జాగ్రత్తగా ఉండాలని, సురక్షిత ప్రాంతాల్లో తలదాచుకోవాలని సూచించింది.

# ప్రధాని మోదీకి ట్రంప్ ఫోన్.. 'హర్మూజ్'పై కీలక చర్చ

-మొదటిపేజీ తరువాయి
జలసంధిని తెరిచిఉంచాల్సిన ఆవశ్యకతపైనా చర్చించినట్లు భారత్‌లో అమెరికా రాయబారి సెర్గియో గోర్ 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. ఈ ఏడాదిలో ప్రధాని మోదీతో ట్రంప్ టెలిఫోన్ సంభాషణ జరపడం ఇది రెండోసారి.

**'హర్మూజ్' తెరిచి ఉండేలా చూడటం అత్యవసరం: మోదీ**

అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో ఫోన్‌లో మాట్లాడినట్లు ప్రధాని మోదీ తెలిపారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. పశ్చిమాసియాలో పరిస్థితులపై తమ మధ్య ప్రయోజనకరమైన చర్చ సాగిందన్నారు. వీలైనంత త్వరగా ఉద్రిక్తతలను తగ్గించి, శాంతిని పునరుద్ధరించేందుకు భారత్ మద్దతు ఉంటుందని స్పష్టం చేసినట్లు పేర్కొన్నారు. హర్మూజ్ జలసంధిని తెరిచి ఉంచడం, రక్షణ కల్పించడం, అందరికీ అందుబాటులో ఉండేలా చూడటం యావత్ ప్రపంచానికి అత్యవసరమని పేర్కొన్నారు. శాంతి, సుస్థిరత కోసం చేసే ప్రయత్నాలకు భారత్ సహకారం ఉంటుందని తెలిపారు.

మరోవైపు, ఇరాన్‌లో విద్యుత్కేంద్రాలు, ఇంధన మౌలికసదుపాయాలపై ఐదు రోజుల పాటు దాడులు నిలిపివేస్తున్నట్టు ట్రంప్ సోమవారం ప్రకటించిన మరుసటిరోజే నేరుగా ప్రధాని మోదీకి ఫోన్ చేసి మాట్లాడటం ప్రాధాన్యం సంతరించుకుంది. పశ్చిమాసియాలో పరిణామాలు, ట్రంప్ తీసుకున్న నిర్ణయాలు, యుద్ధం నేపథ్యంలో ప్రపంచ వ్యాప్తంగా చోటుచేసుకుంటున్న పరిణామాల గురించి ఇరువురు నేతల మధ్య చర్చ జరిగినట్లు సమాచారం. భారత్‌ది ఎప్పుడూ శాంతి మార్గమేనని, యుద్ధమనేది మానవాళి ప్రయోజనాలకు ఏమాత్రం శ్రేయం కాదని ప్రధాని మోదీ ఇప్పటికే స్పష్టం చేశారు. ఇరు దేశాలు చర్చల ద్వారానే తమ మధ్య విభేదాలను పరిష్కరించుకోవాలని, ఆ దిశగానే ముందుకెళ్లాలని పార్లమెంటులో నిన్న మోదీ మాట్లాడిన నేపథ్యంలో ట్రంప్ ఫోన్ చేసి మాట్లాడటం ప్రాధాన్యం సంతరించుకుంది.

# గ్రామాల నుంచి విచ్చేసిన ప్రజల నుంచి వినతులు స్వీకరించిన చింతమనేని

## నాగస్విని పేరంటాల తల్లి 5 వ వార్షి కోత్సవ ఉత్సవాల గోడ పత్రిక విడుదల



**దెందులూరు, పెన్ సత్తా, మార్చి 24:** ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ని పెదవేగి మండలం దుగ్గిరాల్లోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఉదయం ఏలూరు రూరల్ మండలం, గుడివాక లంక గ్రామ పెద్దలు, బంట పెద్దలు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎంపి కైన గుడివాక లంక బంట పెద్దలకు దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అభినందనలు తెలిపారు. దెందులూరు మండలం లోని గాలాయి గూడెం గ్రామంలో ఏప్రిల్ 7, 2026 వ తేదీ నుంచి 9 వ తేది వరకు జరగనున్న నాగస్విని పేరంటాల తల్లి 5 వ వార్షికోత్సవాల సందర్భంగా ఉత్సవాల గోడ పత్రికను మంగళవారం ఉదయం దుగ్గిరాల్లోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే చింతమనేని, ఉత్సవ కమిటీ నిర్వాహకులు, కూటమి నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ప్రతి ఏటా నాగాస్విని పేరంటాలు తల్లి ఉత్సవాలు ఘనంగా నిర్వహించడం ఎంతో అభినందనీయమని, ఉత్సవాలకు హాజరయ్యే భక్తులకు ఎటువంటి అసౌకర్యనం కలగకుండా ఉత్సవాలు ఘనంగా జరిగేలా ఉత్సవ కమిటీ నిర్వాహకులు చర్యలు చేపట్టాలని, ఉత్సవాలకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సూచించారు. ఈ సందర్భంగా దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ని క్యాంపు కార్యాలయంలో పలువురు ప్రజా ప్రతినిధులు, నియోజకవర్గ కూటమి నాయకులు వివిధ శాఖల అధికారులు సిబ్బంది ప్రజలు మర్యాద పూర్వకంగా కలిసి పలు ఆహ్వాన పత్రికలను పుష్పగుచ్చాలను అందించారు. ఈ సందర్భంగా పలు గ్రామాల నుంచి విచ్చేసిన ప్రజల నుంచి వినతులు స్వీకరించిన చింతమనేని ప్రభాకర్ సత్వరమే వాటిని పరిష్కరించేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

# మధ్యాహ్న భోజన నాణ్యత పై ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఆకస్మిక తనిఖీ





- స్వయంగా రుచి చూసి అధికారులకు కీలక ఆదేశాలు.

**గన్నవరం, పెన్ సత్తా, మార్చి 24:** విద్యార్థులకు అందించే మధ్యాహ్నం భోజనం రుచిగా శుచిగా ఉండేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు సూచించారు. మంగళవారం ఆయన ఎన్టీఆర్ జిల్లా, విజయవాడ రూరల్ మండలం నిడమానూరు గ్రామం లోని జిల్లా పరిషత్ హైస్కూల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో అమలు అవుతున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను ఆయన స్వయంగా పర్యవేక్షించారు. పాఠశాలకు చేరుకున్న ఎమ్మెల్యే నేరుగా భోజనశాలకు వెళ్లి, విద్యార్థులకు వడ్డిస్తున్న ఆహారాన్ని స్వయంగా పరిశీలించారు. ఆహారం నాణ్యతను పరిశీలించిన ఆయన, విద్యార్థులతో కాసేపు ముచ్చటించి భోజనం ఎలా ఉందో అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థులకు అందించే డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం కేవలం కడుపు నింపడమే కాకుండా, అది రుచిగా, అత్యంత శుచిగా ఉండేలా నిర్వాహకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఆహార నాణ్యత విషయంలో ఎటువంటి రాజీ పడకూడదని స్పష్టం చేశారు. భోజనం సిద్ధమైన తర్వాత విద్యార్థులకు వడ్డించే ముందు, ప్రతిరోజూ ఒక ఉపాధ్యాయుడు తప్పనిసరిగా ఆ ఆహారాన్ని రుచి చూసి నాణ్యతను ధృవీకరించాలని ఆయన ఆదేశించారు.



# కోలాహాలంగా హోం మంత్రి అనిత జన్మదిన వేడుకలు





- హోం మంత్రికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ప్రజా ప్రతినిధులు, అధికారులు
- సందడిగా హోం మంత్రి నివాసం

**నక్కపల్లి, పెన్ సత్తా మర్చి 24:** రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత జన్మదిన వేడుకలు మంగళవారం పార్టీ నాయకులు, అభిమానులు మధ్య కోలాహాలంగా జరిగింది. నక్కపల్లి లో మంత్రి నివాసం వద్ద ఘనంగా జన్మదిన వేడుకలు నిర్వహించబడ్డాయి. వేద పండితుల ఆశీర్వచనాల మధ్య, అభిమానుల శుభాకాంక్షలతో వేడుకలు ఉత్సాహ భరితంగా కొనసాగాయి. హోం శాఖ మంత్రి వంగలపూడి అనితకు జన్మదిన శు భాకాంక్షలు తెలిపేందుకు వందలాది మంది ప్రజలు, పార్టీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొని పుష్ప గుచ్చాలు, సాలువాలు, గజమాలతో జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. మంత్రి అనితకు శుభాకాంక్షలు తెలుపేందుకు వివిధ ప్రాంతాల నుంచి నాయకులు, అధికారులు, ఉద్యోగులు, యువకులు,సంఘాల ప్రతినిధులు భారీగా తరలివచ్చారు. మంత్రి నివాసం వద్ద అభిమానుల సందడితో పండగ వాతావరణం నెలకొంది. మంత్రి జన్మదిన సందర్భంగా ఏర్పాటుచేసిన భారీ కేక్ హోం మంత్రి కట్ చేసి అభిమానులకు నాయకులకు పంచిపెట్టారు. ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన ప్రజా ప్రతినిధులు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు కూడా ఈ కార్యక్రమానికి హాజరై, మంత్రికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. పేట నియోజకవర్గ పరిధిలోని పలు గ్రామాల్లో మంత్రి జన్మదినాన్ని పురస్కరించుకుని కూటమి నాయకులు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడంతో పాటు, ఆసుపత్రుల్లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాలుగు మండలాల ముఖ్య నాయకులు, అధికారులు పాల్గొన్నారు.





# సోలార్ విద్యుత్ యూనిట్ల పంపిణీ కార్యక్రమం ప్రారంభించిన చితమనేని



**దెందులూరు, పెన్ సత్తా, మార్చి 24:** నియోజకవర్గంలో ఎస్సీ ఎస్టీ కుటుంబాలకు 100% సబ్సిడీతో 2 కే డబ్ల్యూ సామర్థ్యం గల సోలార్ విద్యుత్ యూనిట్ల పంపిణీ కార్యక్రమం ప్రారంభ మైంది. దెందులూరు గ్రామంలో లబ్ధిదారుని ఇంటి వద్ద ఏర్పాటు చేసిన తొలి సోలార్ విద్యుత్ యూనిట్ ని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి, అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం మరింత అండగా నిలుస్తుందని తెలిపారు. 4707 ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు ఒక్కొక్కటి రూ. 1,70,000/- విలువ గల 2 కే డబ్ల్యూ సామర్థ్యం గల సోలార్ విద్యుత్ యూనిట్లను 100% సబ్సిడీ పై ఉచితంగా అందిస్తున్నట్లు చెప్పారు.

అనంతరం దెందులూరు గ్రామంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను, సిసి రోడ్ నిర్మాణ పనులను ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ స్వయంగా పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తోట యేసమ్మ, విద్యుత్ శాఖ జిల్లా పర్యవేక్షక ఇంజనీర్ సాల్మన్ రాజు, సహకార సొసైటీ చైర్మన్ గారపాటి కొండయ్య చౌదరి, యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ పెనుబోయిన మహేష్, బిసి సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి యిప్పిలి వెంటేశ్వర రావు (వైవియార్), కూటమి నాయకులు కమ్మ శివరామ కృష్ణ, కూరపాటి రత్న కిశోర్, జనసేన నాయకులు మేడీది రిధ్వీ, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి సంపంగి తిలక్, మండల తహసీల్దార్ బత్తిన సుమతి, ఎంపీడీవో ప్రతాప్, డిఈ అంబేద్కర్ సహా పలువురు కూటమి నాయకులు, వివిధ శాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.


# ఆర్డీటీకి కష్టం వస్తే.. అది జిల్లా ప్రజలకు కష్టం వచ్చినట్టే.

- ఈ ప్రభుత్వంలో అలాంటి పరిస్థితి రానివ్వం.. పరిటాల శ్రీరామ్.
- ఆర్డీటీకి ఎఫ్.సి.ఆర్.ఏ రెన్యూవల్ పై శ్రీరామ్ హర్షం.
- మంత్రి నారా లోకేష్ అలుపెరగని కృషి వలనే సాధ్యమైందన్న శ్రీరామ్.



**అనంతపురం, పెన్ సత్తా, మార్చి 24**: జిల్లాకు జీవనాడి లాంటి ఆర్డీటీకి కష్టం వస్తే, ప్రజలకు కష్టం వచ్చినట్టేనని, దానిని ఈ ప్రభుత్వం రానివ్వదని ధర్మవరం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ అన్నారు. ఆర్డీటీకి ఎఫ్.సి.ఆర్.ఏ రెన్యూవల్ చేస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పై ఆయన హర్షం వ్యక్తం చేశారు. గత కొన్ని నెలలుగా సంస్థ నిర్వహణ పై చాలా మందికి ఆందోళన ఉండేదని, కానీ వాటన్నింటినీ కేంద్ర ప్రభుత్వం తొలగించిందన్నారు. ఇది జిల్లా ప్రజలకు ఒక పండుగ లాంటి రోజన్నారు. ఇది ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ కృషి వలనే సాధ్యమైందన్నారు. ఆర్డీటీకి ఎఫ్.సి.ఆర్.ఏ ఆగినప్పుడు తాము ముఖ్యమంత్రి, మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లినప్పుడు వారు ఈ ప్రాంత ప్రజలకంటే ఎక్కువగా ఆలోచించారన్నారు. ఇది వారి బాధ్యతగా, ఆర్డీటీ అంటే అభిమానంతో సమస్యను పరిష్కరించేలా చొరవ చూపారన్నారు. దిల్లీలో మన ఎంపీలతో ఒక బృందాన్ని ఏర్పాటు చేసి అడ్డంకుల్ని తొలగిస్తూ వచ్చారన్నారు. ప్రధానమంత్రి మోదీ, హోం మంత్రి అమిత్ షాను కలిసి సమస్యను వివరించి ఆర్డీటీకి ఎఫ్.సి.ఆర్.ఏ రెన్యూవల్ సాధించారన్నారు. 1970 కాలం నుంచి ఫాదర్ ఫెర్రర్ జిల్లా ప్రజలకు అందించిన సేవల గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిన అవసరం ఉందన్నారు. విద్య, వైద్యం, క్రీడలు, వ్యవసాయం, గృహ నిర్మాణంలో లక్షల మందికి సాయం చేశారన్నారు. ఓ విధంగా ఇది జిల్లాకు జీవనాడిగా మారిందన్నారు. అలాంటి సంస్థకు కష్టం వస్తే, ఈ ప్రభుత్వం కూడా అలానే స్పందించిందన్నారు. అనేక ప్రయత్నాల తర్వాత ఎఫ్.సి.ఆర్.ఏ రెన్యూవల్ కావడం పట్ల జిల్లా ప్రజలంతా హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఇందులో మరీ ముఖ్యంగా మంత్రి నారా లోకేష్ కు కృతజ్ఞతలు చెప్పాల్సిన రోజన్నారు. ఇక పై కూడా ఆర్డీటీ సేవల్ని విస్తృతం చేస్తూ జిల్లా ప్రగతిలో భాగస్వామ్యం చేసే విధంగా ప్రభుత్వం పని చేస్తుందని శ్రీరామ్ అన్నారు.

# గత పొరపాట్లకు తావివ్వొద్దు, చందనోత్సవం సమీక్షలో గంటా.



**విశాఖపట్నం, పెన్ సత్తా, మార్చి 24:** సింహాచలేశుని చందనోత్సవంలో ఈసారి ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆదేశించారు. చందనోత్సవం పై మంగళవారం కలెక్టరేట్ లో జరిగిన సమీక్షలో ఆయన జూమ్ ద్వారా పాల్గొన్నారు. గత ఏడాది చందనోత్సవం ముందు రోజు రాత్రి 11 గంటలకు గానీ రూ. 1,500, రూ. 1,000 టికెట్ల జారీ చేయలేదని, అలాంటి ఘటనలు పునరావృతం కానివ్వద్దని పేర్కొన్నారు. జారీ చేసే టికెట్లు కనీసం 3 రోజుల ముందు ఇవ్వగలిగితే దానికి తగ్గట్టు భక్తులు ప్రణాళికను రూపొందించు కుంటారని చెప్పారు. టికెట్ల జారీలో గందరగోళం కారణంగా డూప్లికేట్ ఆరోపణలు కూడా వచ్చాయన్నారు. ఎక్కువ రేటు టికెట్ల కొనుగోలు చేసిన వారికి క్యూ లైన్లలో ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. ఎన్ని టికెట్ల ప్రింట్ చేశారు, ఎన్ని పంపిణీ చేశారు. అనే లెక్క ఖచ్చితంగా ఉండాలని, గత ఏడాది టికెట్ల వ్యత్యాసం ఇంకా తేలలేదన్నారు. తెల్లవారు జామున తొలి దర్శనం గంట ముందు జరిగేట్టు చూస్తే భక్తులకు గంట అదనంగా స్వామి వారి నిజరూప దర్శన అవకాశం కల్పించవచ్చని వివరించారు. చందనం గట్టిగా ఉంటే తొలి దర్శనం ఆలస్యమవుతుందని అర్చకులు తెలిపారు. ఉదయం అంతరాలయ దర్శనం ఒక గంటకు పరిమితం చేయాలని, అవసర మైతే సాయంత్రం అరగంట పునరుద్ధరించ వచ్చన్నారు. పూర్తి స్థాయి ఈఓ ఉన్నందున ఈసారి చందనోత్సవం సమర్థంగా నిర్వహించాలని చెప్పారు.

# స్వర్ణ గ్రామ స్వర్ణ వార్డులలో 465 సేవలు.

- గ్రామ,వార్డు కార్య దర్శుల అనధికార డిప్యుటేషన్లు రద్దు చేయాలి.
- ఏకీకృత కుటుంబ సర్వే వల్ల ప్రజలకు ఎలాంటి నష్టం ఉండదు.
- జిల్లా ఇంచార్జి మంత్రి.
- డా.బాల వీరాంజనేయ స్వామి






**విశాఖపట్నం, పెన్ సత్తా, మార్చి 24:**స్వర్ణ గ్రామ స్వర్ణ వార్డుల్లో ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడమే ధ్యేయంగా సంబంధిత అధికారులు పనిచేయాలని జిల్లా సాంఘిక సంక్షేమ, జి ఎస్ డబ్ల్యూ ఎస్, జిల్లా ఇన్చార్జి మంత్రి డోల బాల వీరాంజనేయ స్వామి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్లో స్వర్ణ గ్రామ స్వర్ణ వార్డుల పని తీరు పై ఇన్చార్జి మంత్రి స్వామి జోనల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, సంబంధిత జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ ఎం. ఎన్. హరేందిర ప్రసాద్, స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు డైరెక్టర్ శివప్రసాద్, ప్రభుత్వ విప్ పీవీజీఆర్ నాయుడు, విష్ణు కుమార్ రాజు సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఏకీకృత కృత కుటుంబ సర్వే, పి4, బంగారు కుటుంబాలు, ఆధార్, ఈ కేవైసీ, కేపిఐ, వాట్సాప్ గవర్నెన్స్ తదితర అంశాల పై సమీక్ష చేశారు. ఈ సమావేశంలో మంత్రి స్వామి మాట్లాడుతూ గ్రామ స్వర్ణ వార్డులు వచ్చిన తరువాత మొదటి సమావేశం విశాఖపట్నంలో నిర్వహిస్తున్నామన్నారు. గ్రామ వార్డు కార్యదర్శుల ద్వారా 465 సేవలను ప్రజలకు అందిస్తున్నామన్నారు. స్వర్ణ గ్రామ వార్డుల్లో పని చేసేవారు ప్రజలకు సేవలు అందించడమే లక్ష్యంగా పని చేయాలన్నారు. రాబోయే ఆరు నెలల్లో స్వర్ణ గ్రామ వార్డులకు హద్దులు నిర్ణయిస్తామన్నారు. గ్రామ వార్డు కార్యదర్శుల అనధికార డిప్యూటేషన్లు రద్దుచేసి తిరిగి వారినీ యధా స్థానాల్లో నియమించడానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఏకీకృత కుటుంబ సర్వే తప్పులు లేకుండా పూర్తి చేయాలని, తప్పులు జరిగితే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సర్వే వల్ల ప్రజలకు ఎలాంటి నష్టం ఉండదని, ప్రభుత్వ అధికారులు చేస్తున్న సర్వేకు ప్రజలు సహకరించాలని కోరారు. కుటుంబ సర్వే, వాట్సాప్ సేవలు, మనమిత్ర ఆధార్ తదితర వాటి పై ప్రజల్లో విస్తృత ప్రచారం చేసి అవగాహన కల్పించాలని కోరారు. ఎంపీడీవోలు జోనల్ అధికారులు, జిల్లా అధికారులు సమర్థవంతంగా పర్యవేక్షణ చేసి ప్రజలకు వీలైనంత మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేయాలని కోరారు.

ఈ సమావేశంలో జిఎస్డబ్ల్యూఎస్ అధికారి ఉషారాణి, జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ సత్యవేణి, జోనల్ అధికారులు, ఎంపీడీవోలు, పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# పిఆర్సీ అమలు, ఆర్థిక బకాయిల సాధన కోసం పోరు తీవ్రతరం.






- గొంది చినబ్బాయ్, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి.

**అనకాపల్లి, పెన్ సత్తా, మార్చి 24:**12 వ పిఆర్సీ అమలు, ఆర్థిక బకాయిల చెల్లింపు, పెండింగ్ డిఏల విడుదల, సిపిఎస్ రద్దు తదితర డిమాండ్ల సాధన కోసం మంగళవారం అనకాపల్లి పట్టణ నాలుగు రోడ్ల కూడలి లో యుటిఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.

ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చినబ్బాయ్ మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయుల అండదండలతో అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ఘోరంగా వైఫల్యం చెందిందన్నారు. 12 వ పిఆర్సీ గడువు ముగిసి మూడేళ్లు కావస్తున్నా పిఆర్సీ కమిషన్ ను ఏర్పాటు చేయడంలో తీవ్ర నిర్లక్ష్యం కనపరుస్తున్నదన్నారు. తాము అధికారం లోకి రాగానే ఉద్యోగులకు మెరుగైన వేతనాలను అమలు చేస్తామని ఆర్భాటంగా హామీలిచ్చిన కూటమి పెద్దలు, వైసీపీ ప్రభుత్వ హయాంలో నియమించిన పిఆర్సీ చైర్మన్ డాక్టర్.మన్మోహన్ సింగ్ తన బాధ్యతలకు రాజీనామా చేసి ఏడాదిన్నర కాలం కావస్తున్నా చైర్మన్ ను నియమించకుండా తాత్సారం చేయడంలో ఆంతర్యం ఏమిటని నిలదీశారు. గతంలో వైసీపీ ప్రభుత్వం రివర్స్ పిఆర్సీని అమలు చేసి, ఉద్యోగ, ఉపాధ్యాయులను మోసగిస్తే, కూటమి ప్రభుత్వం సైతం అదే బాటలో నడుస్తున్నదని ఆరోపించారు. ఉద్యోగులకు ఇవ్వాల్సిన ఆర్థిక బకాయిలను ఆరు నెలల్లోగా చెల్లిస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం కేవలం 9 వేల కోట్ల రూపాయలను మాత్రమే చెల్లించి చేతులు దులుపుకుందన్నారు. ఇంకా ఉద్యోగులకు చెల్లించాల్సిన 30 వేల కోట్ల బకాయిల చెల్లింపుల పై స్పష్టత లేదన్నారు. బకాయిలను ఎప్పటి లోగా చెల్లిస్తారో స్పష్టం చేయాలని ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు. డిఏ లు సకాలంలో చెల్లించకపోతే ఉద్యోగులు ఎలా జీవిస్తారని ప్రతిపక్ష హోదాలో గగ్గోలు పెట్టిన కూటమి పెద్దలు నాలుగు డిఏ లను చెల్లించకుండా కాలయాపన చేయడం ఏంటని వారు నిలదీశారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన ఈ మూడేళ్ళ కాలంలో ఒకే ఒక్క డిఏ చెల్లింపు తప్ప ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఎలాంటి ఆర్థిక ప్రయోజనం చేకూర్చలేదన్నారు. సిపిఎస్ రద్దు, పాత పెన్షన్ విధానం అమలు పై కనీసం ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదన్నారు. కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని రెండేళ్లు వేచి చూశామని, ప్రభుత్వ విధానంలో మార్పు రాకపోతే ఇక పోరాటం తప్పదని వారు హెచ్చరించారు. ఇప్పటికే రణభేరి 1.0, రణభేరి 2.0 పేర్లతో పోరాటాలు చేపట్టామని, అయినప్పటికీ ప్రభుత్వంలో ఎలాంటి స్పందన లేకపోవడం తగదన్నారు. ఉద్యోగుల సైతం ప్రభుత్వంలో, ప్రజలలో భాగమనే విషయాన్ని పాలకులు గుర్తెరగాలన్నారు. పిఆర్సీ అమలుకు నోచుకోకపోవడం, ఆర్థిక బకాయిల చెల్లింపులు పూర్తిస్థాయిలో జరగకపోవడంతో పదవీ విరమణ పొందుతున్న ఉద్యోగ, ఉపాధ్యాయులు తీవ్రంగా నష్టపోతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటి కైనా ప్రభుత్వం తక్షణమే స్పందించి 12 వ పిఆర్సీ ని ఏర్పాటు చేయాలని, పిఆర్సీ అమలయ్యే వరకు 29 శాతం మధ్యంతర భృతిని చెల్లించాలని, ఆర్థిక బకాయిల చెల్లింపులకు రోడ్ మ్యాప్ ప్రకటించి, నిర్ణీత గడువు లోగా చెల్లించాలని, పెండింగ్ డిఏ లను విడుదల చేయడంతో పాటు, సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వం తక్షణమే స్పందించక పోతే, ఏప్రిల్ 1, 2 తేదీలలో జిల్లా కేంద్రాలలో ఏప్రిల్ 15 నుండి 19 వరకు రాష్ట్ర కేంద్రంలో నిరాహార దీక్షలు చేపట్టనున్నట్టు వారు వివరించారు. అప్పటికీ ప్రభుత్వం దిగి రాకపోతే ఏప్రిల్ 28 వ తేదీ ఛలో సెక్రటేరియట్ కార్యక్రమాన్ని నిర్వహించి సెక్రటేరియట్ ను ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ సందర్భంగా ఏపీఎన్జిజిఓ అనకాపల్లి జిల్లా అధ్యక్షులు పీలా రవికుమార్, ప్రధాన కార్యదర్శి డి. శేషుకుమార్, ఖజానా శాఖ సంఘ నాయకులు డి. ఆనంద్ ధర్నా శిభిరాన్ని సందర్శించి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమం లో జిల్లా కార్యదర్శులు గుత్తుల సూర్య ప్రకాష్, వైరాల రమేష్ రావు, ఆడిట్ కమిటీ కన్వీనర్ బైలపూడి దేముడు నాయుడు, రాష్ట్ర కౌన్సిలర్ ఎస్. ఎస్. నాగమణి, అనకాపల్లి నియోజక వర్గ మండలాల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# కాగిత గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు





**నక్కపల్లి, పెన్ సత్తా, మార్చి 24 :** మండలంలో కాగిత గ్రామ పంచాయతీలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్టు గ్రామ సర్పంచ్ పోతంశెట్టి రాజేష్ తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ జాతీయ రహదారిని ఆనుకొని కాగిత గ్రామం ఉండడం వల్ల గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు, దొంగతనాలు జరగకుండా అరికట్టేందుకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సంకల్పించానన్నారు. గ్రామానికి ప్రధాన కూడలిలో జాతీయ రహదారిలో ఉన్న ఆంజనేయ స్వామి గుడి వద్ద, ఎస్సీ కాలనీ రోడ్డు, రాజీవ్ పల్లెబాట రోడ్డు లో సూర్యనారాయణమూర్తి గుడి వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగింది అన్నారు. గతంలో పలుమార్లు గ్రామాల్లో ఉన్న ఆలయాల్లో చోరీలు జరిగిన సంఘటనలు ఉన్నాయన్నారు. అంతేకాకుండా గ్రామాన్ని ఆనుకుని జాతీయ రహదారితో పాటు స్టీల్ ప్లాంట్ రోడ్ లో నిత్యం పలు వాహనాలు రాకపోకలు సాగిస్తున్నందున గ్రామ భద్రతను దృష్టిలో ఉంచుకుని సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ రాజేష్ ను గ్రామస్తులు పలువురు అభినందించారు.

# ప్రజా దర్బార్‌తో ప్రజా సమస్యలకు త్వరిత పరిష్కారం.





ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు.

**గన్నవరం, పెన్ సత్తా, మార్చి 24:**ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజా దర్బార్ కార్యక్రమాలు సమర్థవంత మైన వేదికగా నిలుస్తున్నాయని ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు తెలిపారు. మంగళవారం గన్నవరం టీడీపీ కార్యాలయం వద్ద నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో భాగంగా ఆయన నియోజకవర్గానికి చెందిన ప్రజలను నేరుగా నేరుగా అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా భూవివాదాలు, పింఛన్లు, రేషన్, గృహ నిర్మాణం, రహదారులు, తాగునీరు తదితర అంశాలకు సంబంధించిన పలు అర్జీలు ప్రజలు స్వీకరించారు. ప్రతి అర్జీని పరిశీలిస్తూ సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడిన ఎమ్మెల్యే, సమస్యలను ఆలస్యం చేయకుండా త్వరితగతిన పరిష్కరించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా, వారి వద్దకే వెళ్లి సమస్యలు తెలుసుకుని పరిష్కారం చూపడమే ప్రజా దర్బార్ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండటం ప్రజాప్రతినిధుల బాధ్యత అని, ప్రతి సమస్యకు న్యాయం జరిగేలా కృషి చేస్తామని యార్లగడ్డ వెంకట్రావు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## మత్తు పదార్థాలపై యుద్ధానికి యువత సిద్ధం కావాలి

- ఆన్‌లైన్ మోసాలపై జాగ్రత్తలు -- పోలీసుల మార్గనిర్దేశం
- అనుమానాస్పద సంఘటనలు గమనిస్తే వెంటనే సమాచారం ఇవ్వండి






**పెన్ సత్తా, మార్చి 24:** యువతలో మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టడం, సైబర్ నేరాలపై అవగాహన పెంపొందించడం లక్ష్యంగా ఏన్కూర్ మండలంలోని గ్రామాల్లో పోలీసు శాఖతో పాటు ఇతర ప్రభుత్వ విభాగాల సమన్వయంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు విద్యార్థులు, యువత, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరై మార్గనిర్దేశం పొందారు.

ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ మాదకద్రవ్యాల అలవాట్లు యువత జీవితాలను దెబ్బతీస్తాయని, విద్యాభవిష్యత్తు మాత్రమే కాకుండా కుటుంబ మరియు సామాజిక జీవితం కూడా ప్రభావితమవుతుందని తెలిపారు. క్షణిక ఆనందం కోసం అలవాటు పడే మత్తు పదార్థాలు శారీరక-మానసిక ఆరోగ్యాన్ని దెబ్బతీసి, నేరాలకు దారితీసే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

అలాగే సైబర్ నేరాలు రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో మొబైల్ ఫోన్లు, సోషల్ మీడియా వినియోగంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అపరిచితుల నుంచి వచ్చే కాల్స్, సందేశాలు, లింకులు లేదా ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద పరిస్థితులు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని చెప్పారు. సమాచారం అందించిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని ఇన్స్పెక్టర్ కె. హేమరాణి స్పష్టం చేశారు.

గ్రామాల్లో నిర్వహించిన ఈ అవగాహన కార్యక్రమాల్లో చట్టపరమైన అవగాహన, మహిళల భద్రత, సామాజిక సమస్యల పరిష్కారం, ఆరోగ్య పరిరక్షణ, విద్యార్థుల వ్యక్తిత్వ వికాసం వంటి అంశాలపై అధికారులు సమగ్రంగా వివరణ ఇచ్చారు. యువత తప్పుదోవ పట్టకుండా కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు కూడా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో వీఎం బంజర్ రూరల్ సీఐ ముత్తిలింగం, ఎస్ఐ సంధ్య, ఎంఈఓ నాగిరెడ్డి, డాక్టర్ రాములు, ఏఓ నరసింహారావు, హెచ్ఎం వేము రాజు, రెవెన్యూ ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. వివిధ పాఠశాలల విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరై అధికారులు ఇచ్చిన సూచనలు శ్రద్ధగా విన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రులు నాణ్యమైన సేవలకు ప్రతీకలుగా నిలవాలి.



**జిల్లా కలెక్టర్ అంకిత్...**

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పెన్ సత్తా, మార్చి 24:** ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రులు ప్రజలకు నాణ్యమైన సేవలు అందించే ఆదర్శ కేంద్రాలుగా నిలవాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు . మంగళవారం అన్నపురెడ్డిపల్లి మండలంలో విస్తృతంగా పర్యటించిన ఆయన, ఎర్రగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు అన్నపురెడ్డిపల్లి గ్రామంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి, విద్యా మరియు వైద్య సేవల అమలును సమగ్రంగా పరిశీలించారు.

మొదటగా ఎర్రగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్, మందుల గది, ప్రయోగశాల (ల్యాబ్), ఇన్‌పేషెంట్ విభాగం, స్టాక్ రిజిస్టర్, సిబ్బంది హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. అవుట్‌పేషెంట్ రిజిస్టర్‌ను పరిశీలించి, రోజువారీగా వచ్చే రోగుల సంఖ్యపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అవుట్‌పేషెంట్ వార్డులో ఉన్న ఒక బాలుడితో మాట్లాడి, కుక్క కాటు టీకా కోసం వచ్చినట్లు తెలుసుకుని, టీకాలు అందుబాటులో ఉన్నాయా అని విచారించారు.

అత్యవసర పరిస్థితుల్లో రోగులను ఏ ఆసుపత్రులకు రిఫర్ చేస్తున్నారో, అంబులెన్స్ సౌకర్యం అందుబాటు లో ఉందా అనే అంశాలపై ఆరా తీశారు. తనిఖీ సమయంలో మెడికల్ అధికారి అందుబాటులో లేకపోవడంతో కారణాలను ప్రశ్నించగా క్షేత్రస్థాయిలో పర్యటనలో ఉన్నట్లు సిబ్బంది తెలిపారు, వెంటనే మెడికల్ అధికారిని పిలిచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కొంతమంది సిబ్బంది యూనిఫాం (ఆప్రాన్) ధరించకపోవడాన్ని గమనించి, విధి సమయంలో తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని సూచించారు. సిబ్బంది డిప్యూటేషన్‌పై అధిక సంఖ్యలో విధులు నిర్వహిస్తున్న విషయాన్ని గుర్తించి, దీనిపై సమగ్ర నివేదిక సమర్పించాలని జిల్లా వైద్య ఆరోగ్య అధికారిని ఆదేశించారు.

అనంతరం కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని తనిఖీ చేసిన కలెక్టర్, తరగతి గదులను పరిశీలించి విద్యార్థులతో ముచ్చటించారు. పదవ తరగతి ప్రత్యేక తరగతులను పరిశీలిస్తూ, ఇటీవల జరిగిన ఇంగ్లీష్ పరీక్షపై విద్యార్థులను అడిగి తెలుసుకుని, రాబోయే గణిత పరీక్షకు క్రమబద్ధంగా సిద్ధం కావాలని సూచించారు. ఉపాధ్యాయులు ముఖ్యమైన అంశాలపై దృష్టి సారించి, సులభ పాఠాలను పునరావృతం చేయిస్తూ విద్యార్థులను పూర్తి స్థాయిలో సిద్ధం చేయాలని ఆదేశించారు.

విద్యార్థులకు వడ్డించేందుకు సిద్ధంగా ఉన్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన కలెక్టర్, మెనూ ప్రకారం ఆహారం అందిస్తున్నారా అని తనిఖీ చేశారు. మెనూలో ఉన్న కొన్ని పదార్థాలు లేకపోవడంపై కారణాలు అడిగి తెలుసుకుని, వడ్డించిన ఆహారాన్ని తిని రుచి చూసి నాణ్యతను పరిశీలించారు. వంటల్లో ఉప్పు అధికంగా ఉన్నట్లు గమనించి, సరిపడ మోతాదులో మాత్రమే వినియోగించాలని సూచించారు. విద్యార్థులకు పోషకాహారం అందించాలంటే మెనూ ప్రకారం అన్ని పదార్థాలు తప్పనిసరిగా వండాలని స్పష్టం చేశారు.

స్టోర్ రూమ్‌ను పరిశీలించి నిల్వ ఉంచిన ఆహార పదార్థాలు, కూరగాయల నాణ్యతను తనిఖీ చేశారు. ఎండాకాలంలో కూరగాయలు త్వరగా పాడయ్యే అవకాశం ఉన్నందున తాజా, నాణ్యమైన కూరగాయల ను మాత్రమే వినియోగించాలని ఆదేశించారు. మెనూలో ఉన్న బీట్‌రూట్, పాలకూర అందుబాటులో లేకపోవడంపై ప్రశ్నించారు. కిచెన్ గార్డెన్ ఏర్పాటు గురించి విచారించి, ఆర్ ఓ ప్లాంట్ నుంచి వచ్చే వేస్ట్ వాటర్‌ను శుభ్రత పనులకు వినియోగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పాఠశాలలో ట్యాపుల లీకేజీ గమనించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ , ప్రభుత్వ విద్యాసంస్థలు మరియు ఆరోగ్య కేంద్రాలు ప్రజలకు నాణ్యమైన సేవలు అందించే ముఖ్య కేంద్రాలని తెలిపారు . విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పోషకాహారం, పరిశు భ్ర వాతావరణం కల్పించడం అత్యవసరమని తెలిపారు. పదవ తరగతి విద్యార్థులు క్రమబద్ధంగా చదువుతూ ఉత్తమ ఫలితాలు సాధించాలని, ఉపాధ్యాయులు వారికి సమగ్ర మార్గదర్శనం అందించాలని సూచించారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రతి రోగికి సమయానుకూలంగా వైద్య సేవలు, ఔషధాలు అందుబాటులో ఉండేలా చూడాలని, టీకాలు మరియు అత్యవసర మందులు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో రోగులను వేగంగా ఉన్నత స్థాయి ఆసుపత్రులకు తరలించేలా అంబులెన్స్ సేవలు సిద్ధంగా ఉండాలని, రిఫరల్ వ్యవస్థను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు.

సిబ్బంది విధుల్లో క్రమశిక్షణ పాటిస్తూ యూనిఫాం నిబంధనలు తప్పనిసరిగా అమలు చేయాలని, బాధ్యతాయుతంగా సేవలు అందించాలని హెచ్చరించారు. ప్రజలకు మెరుగైన విద్యా, వైద్య సేవలు అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోదని, లోపాలు గుర్తించిన పక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ అంకిత్ స్పష్టం చేశారు.

ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట మెడికల్ అధికారి ప్రియాంక, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శారద, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## టేకులపల్లి మండలంలో మాయమైన జ్యోతిబాపూలే పాఠశాలను వెతికి తీసుకురావాలి.

- భద్రాద్రి జిల్లా విద్యార్థుల హక్కులను ఖమ్మంలో ఎందుకు తాకట్టు పెట్టారు?
- జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించాలి: సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షులు ధరావత్ సురేష్ నాయక్.



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పెన్ సత్తా, మార్చి 24:** సేవాలాల్ సేన టేకులపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో మండల అధ్యక్షులు బానోత్ కిషన్ నాయక్ అధ్యక్షతన సమావేశం జరిగింది ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా సేవాలాల్ సేన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు ధరావత్ సురేష్ నాయక్ పాల్గొన్నారు వారు ఈ సమావేశానికి ఉద్దేశించి మాట్లాడుతూ టేకులపల్లి మండలంలోని నిరుపేద వెనుకబడిన తరగతుల విద్యార్థుల కోసం మంజూరైన మహాత్మా గాంధీ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల గడచిన 10 సంవత్సరాలుగా ఖమ్మం జిల్లాలో కొలువుదీరడం వెనుక ఉన్న అంతర్యం ఏమిటి అని సేవాలాల్ సేన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు ధరావత్ సురేష్ నాయక్ తీవ్రంగా ప్రశ్నించారు.

2016-17 విద్యా సంవత్సరంలో టేకులపల్లి మండల కేంద్రంలోనే అట్టహాసంగా ప్రారంభమైన ఈ పాఠశాల కేవలం కొన్ని నెలలకే సౌకర్యాల నెపంతో ఖమ్మం జిల్లాకు తరలించబడింది. నాటి నుంచి నేటి వరకు (2026) అంటే దాదాపు 10 ఏళ్లు గడుస్తున్నా, తిరిగి సొంత మండలానికి తీసుకురావడంలో అధికారుల జాప్యం వెనుక ఉన్న మతలబు ఏమిటి అని అన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా విడిపోయి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఏర్పడి ఏడేళ్లు దాటినా మా జిల్లాకు కేటాయించిన పాఠశాల పక్క జిల్లాలోనే ఎందుకు కొనసాగుతోందనీ మన జిల్లా అధికారులకు మన విద్యార్థుల ప్రయోజనాల కంటే పొరుగు జిల్లా ప్రయోజనాలే ముఖ్యమా అని ప్రశ్నించారు

టేకులపల్లి మండల మ్యాప్ లో ఉండాల్సిన పాఠశాల మాయమైందని దీనిపై రెడ్ లైన్ వేసి మరీ వెతకాల్సిన దుస్థితిని ప్రభుత్వం కల్పించిందని సురేష్ నాయక్ ఎద్దేవా చేశారు. 60 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఖమ్మంకు వెళ్లి చదువుకోవడం వల్ల స్థానిక గిరిజన, బిసి విద్యార్థులు మానసిక ఒత్తిడికి లోనవుతున్నారు. స్థానికంగా భవనాలు లేవా? లేక నిర్మించే ఉద్దేశం లేదా? అని ప్రశ్నించారు. పదవ తరగతి బోర్డు పరీక్షలు రాయడానికి విద్యార్థులు పడుతున్న అవస్థలను ప్రభుత్వ అధికారులు ఇప్పటికైనా గుర్తించాలని దాదాపుగా 60 కిలో మీటర్లు ప్రయాణం చేస్తూ మండలానికి చేరుకొని పదవ తరగతి బోర్డు పరీక్షలు రాస్తున్నారని అన్నారు

జిల్లా కలెక్టర్ గారు ఈ విషయాన్ని సీరియస్ గా పరిగణించాలనీ టేకులపల్లి మండలంలో ప్రభుత్వ స్థలాలు, భవనాలు అందుబాటులో ఉన్నప్పటికీ పాఠశాలను ఇక్కడికి తరలించకపోవడం వెనుక ఉన్న అదృశ్య శక్తులెవరో తేల్చాలనీ. వెంటనే విచారణ జరిపి, వచ్చే విద్యా సంవత్సరం (2026-27) నుండి పాఠశాల టేకులపల్లిలోనే నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు

లేనిపక్షంలో, సేవాలాల్ సేన ఆధ్వర్యంలో మండల ప్రజలు, విద్యార్థి సంఘాలతో కలిసి జిల్లా కలెక్టరేట్ ముట్టడికి కార్యక్రమానికి పిలుపునిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు సేవాలాల్ సేన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన కార్యదర్శి లౌడియా వెంకటేష్ నాయక్, జిల్లా ఉపాధ్యక్షులు బోడ రమేష్ నాయక్, జిల్లా అధికార ప్రతినిధి బానోతు నాగరాజు నాయక్, జిల్లా ప్రచార కార్యదర్శి జరుపల లాలు నాయక్, లక్ష్మీదేవి పల్లి మండల అధ్యక్షులు బోడ బాలు నాయక్, ధరావత్ కో క్యా నాయక్, ధరావత్ బాలు నాయక్ తదితరులు పాల్గొన్నారు

## ముందస్తుగా బిఆర్ఎస్ పార్టీ నేతలు, అరెస్ట్




**చేగుంట / పెన్ సత్తా, మార్చి 24:** చేగుంట మండల కేంద్రంలో ముందస్తుగా బిఆర్ఎస్ పార్టీ నాయకులను ముందస్తు చేగుంట పోలీసులు అరెస్టు చేశారు. అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్నారని సమాచారం ఇవ్వడంతో అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ యూత్ అధ్యక్షుడు, అన్నం రవి,చేగుంట పట్టణ అధ్యక్షుడు ఎర్ర యాదగిరి, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు కుర్ర లక్ష్మీనారాయణ, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు సోమ సత్యనారాయణ, జర్నల్ సింగ్ వీరిని అరెస్టు చేశారు,

## ఆశా వర్కర్ల ఆందోళన



**చేగుంట : పెన్ సత్తా, మార్చి 24:** చేగుంట పట్టణ కేంద్రంలోనీ ఎంపీడీవో కార్యాలయం వద్ద చేగుంట మండల, ఆశా వర్కర్ల నిరసన వ్యక్తం చేశారు, ఈ సందర్భంగా ఆశా వర్కర్ల సంఘం మండల అధ్యక్షురాలు సమత మాట్లాడుతూ తమకు రెండు నెలలుగా వేతనాలు రాక ఇబ్బందులు పడుతున్నామని తెలుపుతూ, ఉద్యోగ భద్రతతో పాటు ఆరోగ్య బీమా గౌరవ వేతనం పెంపు విషయాలపై నిరసన వ్యక్తం చేస్తున్నట్లు వారు తెలిపారు. అనంతరం ఎంపీడీవో చిన్నారెడ్డి కి వినతి పత్రం అందజేశారు, కార్యక్రమంలో సత్తమ్మ, లావణ్య,శేఖమ్మ భూదేవి, శ్యామల, పుట్లిబాయ్, సుశీలతో, వివిధ గ్రామాల ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు,

## అంత్యక్రియలకు ఆర్థిక సహాయం

- అందజేసిన మాజీ పిఏసిఎస్ డైరెక్టర్ కుమార్



**చేగుంట : పెన్ సత్తా, మార్చి 24:** నార్సింగి మండలం భీమ్రావుపల్లి గ్రామానికి చెందిన ఇప్పకింది ఇందిరా ఇటీవల అనారోగ్యం మరణించిన విషయం తెలిసిన వెంటనే దుబ్బాక ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి ఆదేశాల మేరకు ఆమె అంత్యక్రియల నిమిత్తం ఆర్థిక సహాయం 2500 రూ, అందజేశారు.

ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ డైరెక్టర్ గరిజాల కుమార్, కిష్ట రాములు, ఇప్పకింది మహేష్, బోయిన్ సహదేవు, కాపు నవీన్, ముత్యాలు, ఇప్పకింది నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## భద్రాద్రి రామయ్య సన్నిధిలో పర్యావరణ హితం.....

**విజయవాడ 'కె.పి. అప్పరెల్' సంస్థ భారీ వితరణ.**

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/ భద్రాచలం పెన్ సత్తా, మార్చి 24:** రాబోయే శ్రీ రామనవమి బ్రహ్మోత్సవాల సందర్భంగా భద్రాచల పుణ్యక్షేత్రంలో ప్లాస్టిక్ రహిత వాతావరణాన్ని ప్రోత్సహించేందుకు విజయవాడకు చెందిన ప్రముఖ వస్త్ర ఉత్పత్తుల సంస్థ కె.పి. అప్పరెల్ ముందుకు వచ్చింది. పర్యావరణ పరిరక్షణ ధ్యేయంగా, ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల వాడకాన్ని నివారించి, పర్యావరణ హితమైన వస్త్ర సంచులను వాడాలనే సదుద్దేశంతో ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టారు.

ఈ సందర్భంగా సంస్థ అధినేత కాసరనేని కృష్ణ ప్రసాద్ భద్రాచలం దేవస్థానం కార్యనిర్వాహణ అధికారి కె. దామోదర్ రావు కి కలిసి సుమారు 3500 వస్త్ర సంచులను అలాగే ఎండల దృష్ట్యా భక్తుల సౌకర్యార్థం టోపీలను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ కళ్యాణ ఉభయదాతల కోసం స్వామివారి కళ్యాణ తలంబ్రాలు, శేషవస్త్రాలు మరియు ప్రసాదాల వితరణ కోసం 17" ఐ 15" సైజు గల 3000 కాటన్ సంచులు అతిథుల కోసం:12" ఐ 10" సైజు గల జిప్ సౌకర్యం కలిగిన 500 ప్రత్యేక కాటన్ సంచులు అందిస్తున్నామని అన్నారు.

అదేవిధంగా భక్తుల కోసం ఎండ తీవ్రత నుండి ఉపశమనం పొందేందుకు భద్రాద్రి రాముని లోగో ముద్రించిన వస్త్ర టోపీలు అందిస్తున్నామని వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. భద్రాచలం దేవస్థాన కార్యనిర్వాహణాధికారి కె. దామోదర్ రావు ఈ సందర్భంగా మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా భక్తులకు ప్లాస్టిక్ రహిత సేవలు అందించేందుకు ఈ వస్త్ర సంచులు ఎంతగానో దోహదపడతాయని అన్నారు.

విజయవాడకు చెందిన ఒక సంస్థ ఇలా భద్రాద్రి రామయ్య సేవలో పర్యావరణ హితమైన అడుగు వేయడం నిజంగా గర్వకారణం అని అన్నారు.

భద్రాచలం వంటి పుణ్యక్షేత్రాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంలో భక్తులందరూ భాగస్వాములు కావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఆగమ శాస్త్ర పండితులు, దేవస్థాన సిబ్బంది మరియు సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు



# ట్రంప్ నిర్ణయంతో ఊపందుకున్న మార్కెట్లు




దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం శక్తివంతమైన లాభాలతో ప్రారంభమయ్యాయి. ఇరాన్‌పై జరగాల్సిన దాడులను నిలిపివేస్తూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకున్న నిర్ణయం ప్రభావంతో అంతర్జాతీయంగా చమురు ధరలు గణనీయంగా తగ్గాయి. ఈ పరిణామం ప్రపంచ మార్కెట్లలో సానుకూల వాతావరణాన్ని సృష్టించగా, దాని ప్రభావం భారత మార్కెట్లపై కూడా స్పష్టంగా కనిపించింది.ట్రేడింగ్ ప్రారంభంలోనే బిఎస్ఈ సెన్సెక్స్ సుమారు 1000 పాయింట్లకు పైగా ఎగసి 73,775 స్థాయికి చేరగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ 50 కూడా 300 పాయింట్లకు పైగా లాభపడి 22,848.80 వద్ద కొనసాగింది. అయితే, ఈ లాభాల మధ్య రూపాయి మాత్రం బలహీనంగానే కొనసాగుతూ మరో 18 పైసలు పడిపోయి 93.71 వద్ద ట్రేడ్ అవుతోంది. రంగాల వారీగా చూస్తే ఆటో, బ్యాంకింగ్, ఎనర్జీ, ఫార్మా షేర్లు 1-2 శాతం వరకు లాభాల్లో నిలిచాయి. ముఖ్యంగా ఏషియన్ పెయింట్స్, శ్రీరామ్ ఫైనాన్స్, టైటాన్, ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్, గ్రాసిమ్ ఇండిస్ట్రీస్ వంటి కంపెనీల షేర్లు మంచి ప్రదర్శన చూపుతున్నాయి. అంతర్జాతీయంగా కూడా మార్కెట్లలో సానుకూల ధోరణి కనిపిస్తోంది. జపాన్ నిక్కీ, దక్షిణ కొరియా కోస్పి, ఆస్ట్రేలియా ఏఎస్ఎక్స్, హాంకాంగ్ హాంగ్‌సెంగ్ సూచీలు లాభాల్లో కొనసాగుతున్నాయి. మరోవైపు, సోమవారం అమెరికా మార్కెట్లు కూడా గ్రీన్‌లో ముగిశాయి. ఇక బ్రెంట్ క్రూడ్ ధరలు దాదాపు 13 శాతం పడిపోవడంతో 99 డాలర్ల వద్ద స్థిరపడటం గమనార్హం. ఇది పెట్టుబడిదారుల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేసింది.

# నిర్మాణ వ్యయం, ఇళ్ల ధరలు పెరిగే అవకాశం



పశ్చిమాసియా ఉద్రిక్తతలు ఎక్కువ కాలం కొనసాగితే ముడి సరుకు వ్యయం పెరిగి, అంతిమంగా ఇళ్ల ధరల పెరుగుదలకు దారి తీస్తుందని స్థిరాస్తి సంఘాలైన క్రెడాయ్ జాతీయ అధ్యక్షుడు శేఖర్ పటేల్, నారెడ్కో అధ్యక్షుడు పర్వీన్ జైన్ అభిప్రాయం వ్యక్తం చేశారు. దేశ వ్యాప్తంగా 20,000 మంది డెవలపర్లకు ఈ సంఘాలు ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. నిర్మాణ సామగ్రి కొరత వల్ల, కొన్ని స్థిరాస్తి ప్రాజెక్టులు పూర్తి కావడంలో జాప్యం జరిగే అవకాశం ఉందని పేర్కొన్నాయి. 'కీలక ముడి సరకు దేశీయంగానే ఉత్పత్తి అవుతున్నందున, భారతీయ స్థిరాస్తి రంగం చాలావరకూ స్థిరంగానే ఉంది. అంతర్జాతీయంగా ఇంధన ధరల్లో హెచ్చుతగ్గుల కారణంగా, సరఫరా వ్యవస్థల్లో తాత్కాలిక అంతరాయాలు ఏర్పడుతున్నాయని' అని శేఖర్ పటేల్ వివరించారు. ఇంధన సరఫరా ఇబ్బందుల వల్ల గుజరాత్‌లోని మోర్బీలో మార్బుల్, టైల్స్ తయారీ కేంద్రాల్లో కార్యకలాపాలకు ఆటంకం ఏర్పడుతోందని, రవాణా రంగానికి స్వల్పకాలిక సవాళ్లు ఎదురవుతున్నాయని పటేల్ తెలిపారు. 'ప్రస్తుతం స్టీల్, పీవీసీ ఉత్పత్తులు, వైర్లు, పైపులు, అద్దాలు వంటి కీలక సామగ్రికి కొరత ఉంది. ఇంధన సంబంధిత సవాళ్ల కారణంగా సిరామిక్ ఉత్పత్తుల తయారీ రంగం దెబ్బతింది. యుద్ధం దీర్ఘకాలంపాటు కొనసాగితే, నిర్మాణ వ్యయాలు పెరుగుతాయ'ని అని నారెడ్కో అధ్యక్షుడు పర్వీన్ జైన్ పేర్కొన్నారు. వ్యయాలను డెవలపర్లు వీలైనంత మేర నియంత్రిస్తున్నారని.. అయినా ముడి సరకు ధరలపై ఒత్తిడి కొనసాగితే, అంతిమంగా ప్రాజెక్టు ధరలపై ప్రతిఫలిస్తుందని.. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వ మద్దతు చాలా ముఖ్యమని పేర్కొన్నారు.

# ఇన్‌సైడర్ పరిధిలోకి సెబీ ఛైర్మన్




'పరస్పర విరుద్ధ ప్రయోజనాలు', సెబీ అధికారుల వెల్లడి నిబంధనలపై ఉన్నత స్థాయి కమిటీ చేసిన పలు సిఫారసులను సెబీ బోర్డు సోమవారం ఆమోదించింది. ఈ కమిటీకి విజిలెన్స్ మాజీ చీఫ్ కమిషనర్ ప్రత్యూష్ సిన్హా అధ్యక్షత వహించారు. సెబీ సభ్యులు, అధికారుల ఆస్తులు, పెట్టుబడులు, రుణాలు, ఇతర సంబంధిత విషయాల వెల్లడికి సంబంధించిన ప్రస్తుత నిబంధనలను సమగ్రంగా సమీక్షించడానికి ఈ కమిటీని ఏర్పాటు చేశారు. సెబీ ఛైర్మన్, పూర్తి స్థాయి సభ్యులను కూడా 'ఇన్‌సైడర్' పరిధిలోకి తీసుకురానున్నట్లు సెబీ తెలిపింది. బోర్డు సభ్యులు, ఉద్యోగులు విధుల్లో చేరినప్పుడు, ఏటా, నిర్దిష్ట సందర్భాల్లో, విధులను వదిలి వెళ్లేటప్పుడు తప్పనిసరిగా వారి ఆర్థిక వివరాలను వెల్లడించాలని కమిటీ సూచించింది. తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ) వివరాల వెల్లడిని సులభతరం చేసి మదుపర్లకు మరింత అనుకూలంగా మార్చే ఉద్దేశంతో ఆఫర్ పత్రాలను సంక్షిప్త రూపంలో అందించే విధానాన్ని సెబీ అందుబాటులోకి తెచ్చింది. ఐపీఓ వివరాలను పూర్తి స్థాయిలో పొందుపరిచే డ్రాఫ్ట్ రెడ్ హెర్రింగ్ ప్రాస్పెక్టస్‌తో పాటు.. సంక్షిప్త రూపంలో తెలియజేసే డ్రాఫ్ట్ అబ్రిడ్జెడ్ ప్రాస్పెక్టస్‌ను కూడా పబ్లిక్ ఇష్యూకు వచ్చే కంపెనీలు ఇకపై సమర్పించాల్సి ఉంటుంది. వ్యాపార విధానం, ఆర్థిక పరమైన అంశాలు, ప్రమోటర్లు, రిస్కులు, కీలక పనితీరు సూచీల వివరాలు సులువుగా అర్థం చేసుకునేలా ఈ పత్రంలో ఉండనున్నాయి. ఇష్యూకు రాబోయే కంపెనీ వెబ్‌సైట్, ఎక్కడైతే షేర్లు నమోదు చేయనుందో, ఆ స్టాక్‌ఎక్స్ఛేంజీలు, లీడ్ మేనేజర్ల వద్ద ఈ అబ్రిడ్జెడ్ ప్రాస్పెక్టస్‌ను అందుబాటులో ఉంచాలని సెబీ తెలిపింది. ఈ సంక్షిప్త పత్రాల్లో కంపెనీ ప్రాథమిక వ్యాపార వివరాలను 500 పదాల్లోపే తెలియజేయాల్సి ఉంటుంది.

# మరోసారి తగ్గిన బంగారం ధరలు

గతంలో భారీగా పెరిగిన బంగారం ధరలు గత 10 రోజులుగా వరుసగా తగ్గుతూ వస్తున్నాయి. అమెరికా-ఇరాన్ మధ్య యుద్ధ ఉద్రిక్తతలు కొంత తగ్గే సూచనలు కనిపిస్తుండటం, అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లపై తీసుకున్న తాజా నిర్ణయాలు అంతర్జాతీయ మార్కెట్లో పసిడిపై ఒత్తిడిని పెంచాయి.దీంతో బంగారం రేట్లు తగ్గడం మొదలైనట్లు నిపుణులు చెబుతున్నారు. తాజాగా మంగళవారం ప్రారంభంలో కూడా హైదరాబాద్ బులియన్ మార్కెట్లో బంగారం ధరలు భారీగా పతనమయ్యాయి. తాజాగా 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర ఏకంగా రూ.2,940 తగ్గి రూ.1,40,350కి చేరుకుంది. అదేవిధంగా, ఆభరణాల తయారీలో ఎక్కువగా ఉపయోగించే 22 క్యారెట్ల పసిడి ధర రూ.2,700 మేర క్షీణించి రూ.1,28,650 పలుకుతోంది. అంతర్జాతీయ మార్కెట్లో నెలకొన్న అనిశ్చితి, డాలర్ విలువలో మార్పుల కారణంగా స్థానిక మార్కెట్లో కూడా బంగారం ధరలు తగ్గుముఖం పట్టాయి. వివాహాది శుభకార్యాల సీజన్ నడుస్తున్న వేళ, ధరలు ఈ స్థాయిలో తగ్గడం సామాన్య వినియోగదారులకు మరియు పెట్టుబడిదారులకు పెద్ద ఊరటనిస్తుంది. బంగారం ధరలు ఇంత భారీగా తగ్గడానికి ప్రధానంగా అంతర్జాతీయ పరిణామాలు కారణమని విశ్లేషకులు భావిస్తున్నారు. పెట్టుబడిదారులు సురక్షితమైన పెట్టుబడిగా భావించే బంగారం నుండి క్రమంగా స్టాక్ మార్కెట్ల వైపు మళ్లుతుండటంతో గిరాకీ తగ్గింది. వీటికి తోడు, దేశీయంగా దిగుమతి సుంకాలు మరియు డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువలో వస్తున్న స్థిరత్వం కూడా ధరల తగ్గుదలకు దోహదపడ్డాయి. రానున్న రోజుల్లో కూడా అంతర్జాతీయ మార్కెట్ ధోరణిని బట్టి ధరల్లో మరిన్ని హెచ్చుతగ్గులు ఉండే అవకాశం ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

## బ్యాంక్‌లకు నగదు కటకట



భారత బ్యాంకింగ్ వ్యవస్థ తీవ్ర నగదు కొరతను ఎదుర్కొంటుంది. బ్యాంక్‌ల్లో ద్రవ్య లభ్యత ఒక్కసారిగా భారీ లోటులోకి జారుకుంది. ఈ ఏడాది ఫిబ్రవరి 1 నుండి మార్చి 15 వరకు రోజువారి సగటున రూ.2.50 లక్షల కోట్ల నగదు మిగులు ఉండగా.. ప్రస్తుతం అది రూ.65,900 కోట్ల (7.01 బిలియన్ డాలర్లు) లోటుకు చేరకుంది. ఇది గతేడాది డిసెంబర్ 29 తర్వాత నమోదైన అత్యధిక లోటు స్థాయి. ప్రస్తుతం పరిస్థితి ఒక్కసారిగా తలకిందులైంది. 2026 సంవత్సరంలో ఇంతటి స్థాయిలో నగదు కొరత ఏర్పడటం ఇదే తొలిసారి. ప్రధానంగా భారీగా పన్ను చెల్లింపులు జరగడం, విదేశీ మారక ద్రవ్య మార్కెట్‌లో రూపాయి తీవ్రంగా పతనం కావడంతో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) తీసుకున్న చర్యలతో నగదు లభ్యత తగ్గింది. ఆర్థిక సంవత్సరం 2025-26 ముగింపు నేపథ్యంలో అడ్వాన్స్ టాక్స్, జిఎస్‌టి రూపంలో భారీగా నగదు బ్యాంకుల నుంచి బయటకు వెళ్లడం ప్రధాన కారణమని హెచ్‌డీఎఫ్‌సి బ్యాంక్ ప్రిన్సిపల్ ఎకనామిస్ట్ సాక్షి గుప్తా తెలిపారు. పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ ఉద్రిక్తతల వల్ల రూపాయి విలువపై ఒత్తిడి పెరిగింది. దీన్ని అడ్డుకునేందుకు మార్చి నెలలో ఆర్‌బిఐ సుమారు 20 బిలియన్ డాలర్ల మేర విదేశీ మారక ద్రవ్యాన్ని మార్కెట్‌లోకి విడుదల చేసింది. నగదు కొరత ప్రభావంతో స్వల్పకాలిక రుణాల రేట్లు ఆర్‌బిఐ పాలసీ రేటు 5.25 శాతం కంటే 10 బేసిస్ పాయింట్లు పెరిగి 5.35 శాతానికి పెరిగింది. ఇది బ్యాంక్‌ల్లోని నగదుపైనా ఒత్తిడి పెంచింది. ఆర్థిక ఒత్తిడి మార్చి 31 తర్వాత తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు భావిస్తున్నారు. ఆర్థిక సంవత్సరం ముగింపులో ప్రభుత్వం చేసే ఖర్చుల వల్ల తిరిగి వ్యవస్థలోకి నగదు చేరుతుందని అంచనా వేస్తోన్నారు.

## ఏప్రిల్‌లోనూ ఆసియాకు తగ్గనున్న చమురు సరఫరా



ప్రపంచంలోనే ప్రధాన చమురు ఎగుమతిదారు సౌదీ అరామ్కో ఆసియాకు ఏప్రిల్‌లో వరుసగా రెండవ నెల కూడా ఆసియాకు చమురు సరఫరాను తగ్గించినట్లు సంబంధిత వర్గాలు సోమవారం తెలిపాయి. ఏప్రిల్‌లో యాన్బులోని రెడ్‌సీ పోర్ట్ నుండి ఎగుమతి అయిన అరబ్ లైట్ క్రూడ్‌ను మాత్రమే సరఫరా చేయనున్నట్లు ఆ వర్గాలు పేర్కొన్నాయి. ఆసియా రిఫైనరీలకు సరఫరా తగ్గనుండటంతో శుద్ధి చేసిన ఉత్పత్తులపై పరిమితులు మరింత తీవ్రం కానున్నాయి. ఈ వార్తపై అరామ్కో స్పందించాల్సివుంది. సౌదీ అరేబియా మార్చిలో రోజుకి 4.355మిలియన్ బ్యారెల్స్‌ను ఎగుమతి చేసినట్లు క్ప్లర్ సంస్థ తెలిపింది. రోజుకి 7.108 మిలియన్ బ్యారెల్స్‌ను ఎగుమతి చేసిన ఫిబ్రవరి నెలతో పోలిస్తే ఎగుమతి తగ్గినట్లు సంస్థ పేర్కొంది. హార్ముజ్ జలసంధిలో ఏర్పడిన అంతరాయాన్ని భర్తీ చేసేందుకు అరామ్కో సంస్థ యాన్బు పోర్ట్ నుండి ముడి చమురు ఎగుమతిని పెంచేందుకు యత్నిస్తోంది. దీంతో మార్చిలో లోడింగ్ రికార్డు స్థాయికి పెరుగుతాయని అంచనావేస్తోంది. చైనా సంస్థ సినోపెక్, మార్చిలో యాన్బు పోర్ట్ నుండి సుమారు 24 మిలియన్ బ్యారెళ్ల సౌదీ ముడిచమురును పంపిణీ చేసేందుకు యత్నిస్తోంది. సౌదీ అరామ్కోకి చెందిన సమ్రెఫ్ రిఫైనరీ సమీపంలో ఒక డ్రోన్ కూలిపోవడంతో, గురువారం (మార్చి 19న ) యాన్బు పోర్ట్‌లో చమురు లోడింగ్‌కు కొంతసేపు అంతరాయం కలిగిన సంగతి తెలిసిందే.

## మోడీ హయాంలో రూపాయి మహా పతనం

అంతర్జాతీయ ద్రవ్య మార్కెట్‌లో రూపాయి విలువ రోజురోజుకు అత్యంత అధ్వానంగా మారుతోంది. భారత దేశ చరిత్రలోనే ఎప్పుడూ లేని విధంగా ప్రధాని మోడీ హయంలో డాలర్‌తో రూపాయి మారకం విలువ ఏకంగా 94 మార్క్‌కు క్షీణించింది. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు ధరలు పెరగడం, భారత్ నుంచి విదేశీ ఇన్వెస్టర్లు భారీగా నిధులను ఉపసంహరించుకోవడంతో సోమవారం అమెరికన్ డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ 50 పైసలు పతనమై రికార్డు స్థాయిలో 94.03కు దిగజారింది. ఉదయం ఇంటర్‌బ్యాంక్ ఫారిన్ ఎక్స్ఛేంజీలో 93.84 వద్ద తెరుచుకున్న రూపాయి.. వెంటనే 94కు పడిపోయింది.శుక్రవారం 64 పైసలు క్షీణించి 93.53 కనిష్టాన్ని తాకి.. తొలిసారి 93 మార్క్‌ను చేరిన రూపాయి విలువ మరో సెషన్‌లోనే 94 మార్క్‌ను దాటడం తీవ్ర ఆందోళనకర అంశం. పశ్చిమాసియాలో పెరుగుతున్న భౌగోళిక ఉద్రిక్తతలు, దేశీయ స్టాక్ మార్కెట్లు ఒక్కరోజే 1,836 పాయింట్లు కుప్పకూలడం రూపాయిపై తీవ్ర ఒత్తిడిని పెంచాయని ఆర్థిక నిపుణులు విశ్లేషిస్తున్నారు. రానున్న రోజుల్లో రూపాయి విలువ రూ.93.60 నుండి 94.40 మధ్య ట్రేడ్ అయ్యే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. అయితే రిజర్వ్ బ్యాంక్ జోక్యం చేసుకుంటే దిగువ స్థాయిల వద్ద కొంత మద్దతు లభించవచ్చని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ పతనం కేవలం గణాంకాలకే పరిమితం కాకుండా దేశ ఆర్థిక వ్యవస్థకు పెను సవాలుగా మారుతోంది. రూపాయి విలువ ఇలాగే క్షీణిస్తూ ఉంటే దేశంలో ద్రవ్యోల్బణం నియంత్రణ తప్పే ప్రమాదం ఉంది.

RNI:APTEL/2023/87729
పెన్ సత్తా
PEN SATTA Telugu Daily

# ఎడిటోరియల్

## విద్యకు కేటాయింపులు పెరిగాయా!

ఒక సమాజం సాధించే ప్రగతికి, వ్యక్తిత్వ వికాసానికి విద్య అనేది పునాది వంటిది. విద్య కేవలం అక్షరాస్యతను పెంచడమే కాకుండా, విచక్షణ జ్ఞానాన్ని అందించి మనిషిని సామాజిక బాధ్యత కలిగిన పౌరుడిగా తీర్చిదిద్దుతుంది. నైపుణ్యం కలిగిన మానవ వనరులను తయారు చేయడంద్వారా దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తుంది. పేదరికాన్ని నిర్మూలించడానికి విద్య అతిపెద్ద ఆయుధం. మూఢ నమ్మకాలను తొలగించి, లింగ వివక్షలేని సమానత్వ సమాజాన్ని నిర్మించడంలో విద్య కీలక పాత్ర పోషిస్తుంది. వైజ్ఞానిక, సాంకేతిక రంగాలలో కొత్త పరిశోధనలకు, అద్భుతమైన ఆవిష్కరణలకు విద్యాక్షేత్రాలే వేదికలు. క్రమశిక్షణ, నైతిక విలువలు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి, క్లిష్ట పరిస్థితుల్లో సరైన నిర్ణయాలు తీసుకునేలా చేస్తుంది. విద్యా రంగం అభివృద్ధి చెందాలంటే బడ్జెట్‌లో తగినంత నిధులు కేటాయించాలని దశాబ్దాలుగా అనేక కమిషను, జాతీయ విద్యా విధానాలు సిఫార్సు చేస్తూనే ఉన్నాయి. కొఠారి కమిషన్ (1964 -66) దేశ స్థూల జాతీయోత్పత్తి (జిడిపి)లో కనీసం 6% విద్యకు కేటాయించాలని సిఫార్సు చేసింది. జాతీయ విద్యా విధానం (ఎన్ఇపి2020) కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి విద్యా రంగానికి చేసే ప్రభుత్వ వ్యయాన్ని జిడిపిలో 6% కి చేర్చాలని స్పష్టంగా పేర్కొంది. ఇటీవల తెలంగాణ విద్యా కమిషన్ తన నివేదికలో రాష్ట్ర బడ్జెట్‌లో కనీసం 18% నిధులను విద్యా రంగానికి కేటాయించాలని ప్రతిపాదించింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన 2014 నుండి నేటి వరకు విద్యా బడ్జెట్ కేటాయింపులు హెచ్చుతగ్గులకు లోనవుతున్నాయి. 2014- 15లో రాష్ట్రం ఏర్పడిన తొలి ఏడాది బడ్జెట్‌లో విద్యకు అత్యధికంగా 10.89% కేటాయించారు. అయితే, ఆ తర్వాత ఏళ్లలో ఈ శాతం క్రమంగా తగ్గుతూ వచ్చింది. 2023 -24 నాటికి ఇది 6.5% కనిష్ట స్థాయికి చేరుకుంది. గత రెండేళ్లుగా కేటాయింపుల్లో స్వల్ప పెరుగుదల కనిపిస్తోంది. 2024- 25లో 7.7%, 2025- 26లో 7.9% నిధులు కేటాయించారు. తాజాగా 2026- 27 బడ్జెట్‌లో రూ. 26,674 కోట్లను (8.22%) కేటాయించడం గమనార్హం.

గత దశాబ్దకాలంలో మొత్తం బడ్జెట్ పరిమాణం సుమారు 200% పెరిగినప్పటికీ, విద్యారంగ కేటాయింపులు మాత్రం దాదాపు 126% మాత్రమే పెరిగాయి. 2026 -27 తెలంగాణ బడ్జెట్‌లో విద్యాశాఖకు చేసిన కేటాయింపులు, విద్యా ప్రాధాన్యతకు తగినట్లు ఉన్నాయా లేదా అనే అంశంపై భిన్నమైన అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ప్రభుత్వం దీనిని 'విద్యా బడ్జెట్'గా అభివర్ణిస్తుండగా, క్షేత్రస్థాయి పరిస్థితులు వేరేలా ఉన్నాయి. గత ఏడాదితో పోలిస్తే కేటాయింపులు రూ. 26,674 కోట్లకు పెరిగాయి. ఇది గత బడ్జెట్ కంటే దాదాపు 15% ఎక్కువ. ఉస్మానియా వంటి పురాతన యూనివర్శిటీలకు, మహిళా యూనివర్శిటీలకు భారీగా నిధులు కేటాయించడం శుభపరిణామం. తెలంగాణ పబ్లిక్ స్కూల్స్', 'ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్'ద్వారా అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యను అందించాలనే లక్ష్యం కనిపిస్తోంది. కానీ మొత్తం రాష్ట్ర బడ్జెట్‌లో విద్య వాటా కేవలం 8.22% మాత్రమే. కొత్త భవనాల నిర్మాణానికి నిధులు ఇస్తున్నప్పటికీ, ఇప్పటికే ఉన్న వేల సంఖ్యలోని జిల్లా పరిషత్ (జడ్పిహెచ్ఎస్), ప్రభుత్వ పాఠశాలల్లో కనీస వసతులు (మరుగుదొడ్లు, తాగునీరు) కల్పించడానికి కేటాయింపులు అంతంతమాత్రంగానే ఉన్నాయి. రాష్ట్రంలో వేల సంఖ్య లో టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.


డిఎస్సి ద్వారా కొత్త నియామకాలు, కాంట్రాక్ట్ టీచర్ల క్రమబద్ధీకరణ వంటి అంశాలకు ఈ బడ్జెట్‌లో స్పష్టమైన ఆర్థిక భరోసా కనిపించడం లేదు. తెలంగాణ విద్యా కమిషన్ తన నివేదికలో సూచించిన అంశాలకు, ప్రస్తుత బడ్జెట్ కేటాయింపులకు మధ్య పెద్ద వ్యత్యాసం ఉంది. కమిషన్ కోరినది 18% బడ్జెట్ వాటా. అయితే ప్రభుత్వం ఇచ్చింది 8.22% బడ్జెట్ వాటా మాత్రమే. ప్రభుత్వం విద్యపై 'దృష్టి' పెట్టిందన్నది వాస్తవం. కానీ అది 'పూర్తి స్థాయి ప్రాధాన్యత'గా మారలేదు. కేటాయింపులు పెరిగినప్పటికీ, అవి పెరిగిన అవసరాలకు సరిపోవు. ముఖ్యంగా సామాన్య విద్యార్థులు చదువుకునే ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి మరిన్ని నిధులు అవసరం. తెలంగాణ (8.23%)తో పోలిస్తే దేశంలోని పలు రాష్ట్రాలు విద్యకు తమ బడ్జెట్‌లో చాలా ఎక్కువ ప్రాధాన్యతనిస్తున్నాయి. ప్రధానంగా ఢిల్లీ ప్రభుత్వం తన మొత్తం బడ్జెట్‌లో సుమారు 22% నుండి 25% నిధులను కేటాయిస్తూ దేశంలోనే ప్రథమ స్థానంలో నిలుస్తోంది. బీహార్: 18% -19%, చత్తీస్‌గఢ్: 18%, అసోం: 15%16%, ఆంధ్రప్రదేశ్: 12% 13% నిధులను కేటాయిస్తున్నాయి. చాలా రాష్ట్రాలు సగటున 14% నుండి 15% వరకు కేటాయిస్తుండగా, తెలంగాణ కేటాయింపులు జాతీయ సగటు కంటే తక్కువగా ఉండటం గమనార్హం. ఢిల్లీ వంటి రాష్ట్రాలు మౌలిక వసతులు, ఉపాధ్యాయ శిక్షణపై పెట్టిన పెట్టుబడి వల్ల అక్కడి ప్రభుత్వ పాఠశాలల ఫలితాల్లో గణనీయమైన మార్పు వచ్చింది. దేశవ్యాప్త సగటు ప్రస్తుతం జిడిపిలో 4.1% - 4.6% మధ్య ఉండగా, తెలంగాణలో ఇది ఇంకా తక్కువగానే ఉంది. ప్రస్తుత ప్రభుత్వం తన ఎన్నికల మేనిఫెస్టోలో రాష్ట్ర బడ్జెట్‌లో 15% నిధులను విద్యకు కేటాయిస్తామని హామీ ఇచ్చింది. అయితే, ప్రస్తుత కేటాయింపు (8.23%) ఆ హామీలో సగం మాత్రమే. విద్యారంగ కేటాయింపులు ఖర్చు కాదు, భవిష్యత్తుపై పెట్టుబడి. సాధారణంగా ప్రభుత్వం చేసే ఖర్చులను అనుత్పాదక వ్యయాలుగా భావిస్తారు. కానీ విద్యారంగంపై చేసే ఖర్చు మాత్రం దేశ భవిష్యత్తును నిర్మించే అత్యుత్తమ పెట్టుబడి. భౌతిక వనరుల కంటే మానవ వనరులే ఒక దేశానికి అసలైన సంపద. నాణ్యమైన విద్యను అందించడం ద్వారా నైపుణ్యం కలిగిన ఇంజనీర్లు, డాక్టర్లు, శాస్త్రవేత్తలు, బాధ్యతాయుతమైన పౌరులు తయారవుతారు. విద్యపై పెట్టే ప్రతి రూపాయి పరోక్షంగా దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తుంది. ఇది పేదరికాన్ని తగ్గించి, ఉపాధి అవకాశాలను మెరుగుపరుస్తుంది. ఆరోగ్యకరమైన, క్రమశిక్షణ కలిగిన సమాజాన్ని నిర్మించడంద్వారా సామాజిక రుగ్మతలు తగ్గుతాయి. అందుకే, బడ్జెట్‌లో విద్యకు ఇచ్చే ప్రాధాన్యతను కేవలం అంకెల్లో చూడకూడదు; అది రాబోయే తరాల అభివృద్ధికి వేసే పునాదిగా గుర్తించాలి.

# ఆముదం తీసుకుంటే మలబద్ధకం, గ్యాస్ నయమవుతాయా?



పేగులకు సంబంధించిన సమస్యలను వదిలించుకోవడానికి ఆముదం భలేగా ఉపయోగపడుతుందని చాలా మంది నమ్ముతుంటారు. శరీరం నుంచి వ్యర్థాలను తొలగించడంలో పేగులు ముఖ్యమైన పాత్ర పోషిస్తాయని అనుకుంటారు. నిజానికి పేగులు సరిగ్గా పనిచేయకపోతే మలబద్ధకం, గ్యాస్, అజీర్ణం వంటి సమస్యలు తలెత్తుతాయి. ఆముదం నూనెను చాలా కాలంగా ఇంటి వైద్యంలో భాగంగా ఉపయోగిస్తున్న సంగతి తెలిసిందే. ఇది చర్మం, జుట్టు, జీర్ణ సమస్యలకు ప్రయోజనకరంగా ఉంటుందని ఆరోగ్య నిపుణులు సైతం అంటున్నారు. ఆముదంలోని పోషకాలు శరీరాన్ని వివిధ మార్గాల్లో ప్రభావితం చేస్తాయి. అందుకే చాలా మంది దీనిని తమ జీవనశైలిలో భాగంగా క్రమం తప్పకుండా ఉపయోగిస్తున్నారు. ముఖ్యంగా పేగులకు సంబంధించిన సమస్యలను వదిలించుకోవడానికి ఆముదం భలేగా ఉపయోగపడుతుంది. శరీరం నుంచి వ్యర్థాలను తొలగించడంలో పేగులు ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. పేగులు సరిగ్గా పనిచేయకపోతే మలబద్ధకం, గ్యాస్, అజీర్ణం వంటి సమస్యలు తలెత్తుతాయి. అలాంటి సందర్భాలలో చాలా మంది ఆముదం నూనెను ఉపయోగిస్తారు. కానీ ఈ నూనె ప్రభావం అందరికీ ఒకేలా ఉండదు. నూనెను అధికంగా లేదా సరైన విధంగా ఉపయోగించకపోతే సమస్య తగ్గకపోవడానికి బదులుగా మరింత తీవ్రతరం అవుతుంది. ఆముదం నూనెలో ప్రధానంగా రిసినోలిక్ ఆమ్లం ఉంటుంది. ఇది జీర్ణవ్యవస్థను ప్రభావితం చేస్తుంది. అంతేకాదు, ఇది పేగు కండరాలను సక్రియం చేయడానికి కూడా సహాయపడుతుంది. ఆముదం నూనెను తీసుకున్న తర్వాత ప్రేగుల కదలికలు పెరుగుతాయి. ఇది కడుపును శుభ్రపరచడాన్ని సులభతరం చేస్తుంది. అంతేకాకుండా ఇందులో ఉన్న కొవ్వు ఆమ్లాలు జీర్ణ రసాలను సక్రియం చేస్తాయి. అందుకే కొంతమంది దీనిని మలబద్ధకం సమస్యలకు ఉపయోగిస్తారు. కానీ మోతాదు, సరైన పద్ధతిపై శ్రద్ధ చూపడం కూడా చాలా ముఖ్యం. నిపుణుల సలహా లేకుండా దీన్ని ఎక్కువగా తీసుకోవడం వల్ల కడుపు తిమ్మిరి, బలహీనత కూడా వస్తుంది. ఈ నూనెను మలబద్ధకం కోసం ఉపయోగిస్తారు. ఇది జీర్ణక్రియను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. కడుపు భారాన్ని తగ్గిస్తుంది. కొంతమంది దీనిని గ్యాస్, ఉబ్బరం నుంచి ఉపశమనం పొందటానికి కూడా ఉపయోగిస్తారు. బాహ్యంగా ఇది కీళ్ల నొప్పులు,పొడి చర్మానికి ఉపయోగిస్తారు. జుట్టు పెరుగుదలను ప్రోత్సహించడానికి, పోషణకు ఆముదం నూనె మంచిది. అయితే దీని నుండి లభించే ఫలితాలు ప్రతి సమస్యకు ఒకేలా ఉండవు. కాబట్టి ఆముదం ఉపయోగించే ముందు వైద్యుడిని సంప్రదించడం చాలా మంచిది.

# రోజూ 15 నిమిషాలు ఇలా చేస్తే.. ఒంట్లో కొవ్వు మంచులా కరగాల్సిందే!



ఆరోగ్యంగా ఉండటానికి రోజూ కొద్ది నిమిషాలైనా శారీరక శ్రమలో పాల్గొనడం చాలా ముఖ్యం. కానీ దానికి సమయం లేని వారు ప్రతిరోజూ 15 నిమిషాలు స్కిప్పింగ్ (జంపింగ్ రోప్) చేయవచ్చని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. నేటి బిజీ జీవనశైలిలో మన ఆరోగ్య నాణ్యత రోజురోజుకూ దారుణంగా క్షీణిస్తోంది. వేళకు భోజనం చేయకపోవడం, తగినంత నిద్ర లేకపోవడం, వ్యాయామం లేకపోవడం వంటి అనేక ఆరోగ్య సమస్యలకు దారితీస్తున్నాయి. అంతే కాదు ఈ అంశాలన్నీ శారీరక, మానసిక ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తాయి. అందువల్ల ఆరోగ్యంగా ఉండటానికి శారీరక శ్రమలో పాల్గొనడం చాలా ముఖ్యం. కానీ దానికి సమయం లేని వారు ప్రతిరోజూ 15 నిమిషాలు స్కిప్పింగ్ (జంపింగ్ రోప్) చేయవచ్చని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. స్కిప్పింగ్ అనేది గుండెను బలోపేతం చేసే, రక్త ప్రసరణను మెరుగుపరిచే గొప్ప కార్డియో వ్యాయామం. అంతే కాదు ఇది గుండెపోటు, అధిక రక్తపోటు వంటి సమస్యల ప్రమాదాన్ని కూడా తగ్గిస్తుంది. త్వరగా బరువు తగ్గాలనుకునే వారు ప్రతిరోజూ 15 నిమిషాలు స్కిప్పింగ్ చేయాలి. ఇది కేలరీలను త్వరగా బర్న్ చేయడానికి మీకు సహాయపడుతుంది. ఇది మీ జీవక్రియను కూడా పెంచుతుంది. త్వరగా బరువు తగ్గడానికి స్కిప్పింగ్ సహాయపడుతుంది.

ప్రతిరోజూ 15 నిమిషాలు స్కిప్పింగ్ చేయడం వల్ల కాళ్ళు, తొడలు, చేతులు, భుజాలలోని కండరాలు బలపడతాయి. ఇది ఆస్టియోపోరోసిస్, పగుళ్ల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. బలహీనమైన కండరాలు ఉన్నవారికి స్కిప్పింగ్ ప్రయోజనకరంగా ఉంటుంది.స్కిప్పింగ్ రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది. ఇది టైప్ 2 డయాబెటిస్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది. అంతే కాదు, నిద్రలేమితో బాధపడేవారు ప్రతిరోజూ 15 నిమిషాలు స్కిప్ చేయాలి. ఇది శరీరం విశ్రాంతి తీసుకోవడానికి,బాగా నిద్రపోవడానికి సహాయపడుతుంది. మీరు కూడా చిన్న చిన్న విషయాలకే ఒత్తిడికి గురైతే ప్రతిరోజూ 15 నిమిషాలు స్కిప్పింగ్ చేయడానికి ప్రయత్నించండి. ఈ వ్యాయామం ఎండార్ఫిన్‌లను విడుదల చేస్తుంది. అంతేకాకుండా ఇది మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. మనస్సును ప్రశాంతపరుస్తుంది. ఒత్తిడి, ఆందోళనను తగ్గిస్తుంది. సహనం, ఓర్పును పెంచుతుంది. ఇది రోజంతా శక్తి, వంతంగా ఉండటానికి, అలసటను తగ్గించడానికి సహాయపడుతుంది.

## ఫిబ్రవరిలో పుట్టిన వారు ఎలా ఉంటారు.. ఈ సీక్రెట్స్ తెలిస్తే అవాక్కవడం పక్కా..




ప్రతి మనిషి పుట్టుక వెనుక ఒక రహస్యం ఉంటుంది.. కానీ ఫిబ్రవరి నెలలో జన్మించిన వారి వ్యక్తిత్వం వెనుక ఒక మర్మమైన ఆకర్షణ దాగి ఉంటుందని జ్యోతిష్య నిపుణులు చెబుతుంటారు. గాలిలో ప్రేమ నిండి ఉండే ఈ నెలలో పుట్టిన వారు రొమాంటిక్‌గా ఉంటారా? తెలివితేటలతో ఇతరులను మంత్రముగ్ధులను చేస్తారా? ప్రతి వ్యక్తి స్వభావం వారు పుట్టిన తేదీ, వారం, నెలపై ఆధారపడి ఉంటుందని జ్యోతిష్య శాస్త్రం చెబుతోంది. ఫిబ్రవరి నెలలో జన్మించిన వారు మిగతా వారితో పోలిస్తే భిన్నమైన, ఆకర్షణీయమైన వ్యక్తిత్వాన్ని కలిగి ఉంటారు. ఫిబ్రవరిలో జన్మించిన వారికి ఇతరులను ఇట్టే ఆకర్షించే శక్తి ఉంటుంది. వీరు చాలా తెలివైన వారు, తమ మాటలతో ఎదుటివారిని సులభంగా గెలుచుకుంటారు. వీరు చాలా సామాజికంగా ఉంటారు. త్వరగా స్నేహితులను చేసుకుంటారు. వీరు ఎప్పుడూ కొత్త విషయాలను నేర్చుకోవడానికి ఉత్సాహం చూపిస్తారు. పరిశోధనల ప్రకారం.. ఈ నెలలో పుట్టిన వారు చాలా రొమాంటిక్ స్వభావం కలిగి ఉంటారు. జీవితంలో స్వేచ్ఛగా ఉండాలని కోరుకుంటారు. ఎప్పుడూ సంతోషంగా ఉండటానికి ప్రయత్నిస్తారు. తమ మనసులోని భావాలను వ్యక్తపరచడంలో వీరు చాలా వినూత్నంగా ఉంటారు. ముఖ్యంగా ఫిబ్రవరిలో జన్మించిన అమ్మాయిలకు ఆత్మగౌరవం చాలా ఎక్కువ. వీరు ఎవరి దగ్గరా, చివరికి తమ భాగస్వామి దగ్గర కూడా తలవంచడానికి ఇష్టపడరు. అలాగే వీరు అంత త్వరగా ఇతరులను నమ్మరు. ప్రతి విషయంలోనూ సొంతంగా ఆలోచించి నిర్ణయాలు తీసుకుంటారు.ఫిబ్రవరిలో జన్మించిన వారు సృజనాత్మకత, దార్శనికత కలిగిన వారు. వీరు కళలు, సాహిత్యం, సైన్స్, టెక్నాలజీ, పాలనా విభాగాలు వంటి రంగాలలో అద్భుతంగా రాణిస్తారు. వీరు తమ కష్టార్జితంతో ధనవంతులు అవుతారు. అయితే కొన్నిసార్లు ఎక్కువ భావోద్వేగానికి లోనవుతుంటారు. ఇది వారి కెరీర్‌లో అడ్డంకులు సృష్టించవచ్చు. కానీ, లక్ష్యంపై దృష్టి పెడితే వీరు తిరుగులేని విజయాన్ని సాధిస్తారు.

## నాన్నతో కలిసి డిన్నర్ చేయడం.. పిల్లల చదువు, భవిష్యత్తును మార్చేస్తుందా?



పేరెంట్స్‌కు పిల్లలపై ఉండే ప్రేమ ఎంత గొప్పదో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. వారు ఏం చేసినా పిల్లల ఆనందం కోసం, ఆరోగ్యం కోసం, వారి క్షేమం కోసం, మెరుగైన భవిష్యత్తుకోసం చేస్తుంటారు. ఎన్ని కష్టాలకైనా ఎదురొడ్డి పిల్లలే సర్వస్వంగా బతికేస్తుంటారు.

అయితే ఇటీవల ఫ్లోరిడా యూనివర్సిటీ నిర్వహించిన తాజా అధ్యయనం మాత్రం మరో ఆసక్తికరమైన విషయాలను వెల్లడించింది. ఏంటంటే.. తండ్రితో కలిసి డిన్నర్ చేసే పిల్లలు అకడమిక్‌గా మెరుగైన పనితీరు కనబరిచే అవకాశం ఎక్కువ. చదువులో, పలు ఇతర విషయాల్లో మంచి సామర్థ్యాన్ని కనబరుస్తారు. ఆత్మ విశ్వాసాన్ని కలిగి ఉంటారు.భాషా నైపుణ్యాలు కూడా..నాన్నతో కలిసి తరచుగా లేదా కనీసం వారానికి నాలుగుసార్లు రాత్రి భోజనం చేసే పిల్లల్లో, అలా చేయనివారితో పోలిస్తే మెరుగైన అకడమిక్ తెలివితేటలు ఉంటాయని అధ్యయనం పేర్కొన్నది. అయితే ఇది గ్రేడ్స్‌తో సంబంధం లేకుండా కాగ్నిటివ్ అండ్ ఎమోషనల్ డెవలప్ మెంట్‌కు సంబంధించినదని నిపుణులు పేర్కొంటున్నారు. నాన్నతో కలిసి డిన్నర్ చేసే అలవాటు పిల్లల్లో మెరుగైన వోకాబ్యులరీ, భావోద్వేగ నియంత్రణ (వఎనీబితినీనిజీశ్రీ తీవణబీశ్రీజీబితినీని) సామర్థ్యాలను పెంచుతుంది. ప్రవర్తనా పరమైన లోపాలను నివారిస్తుంది. అంతేకాకుండా డిన్నర్ చేసే సమయంలో సంభాషణలు పిల్లల భాషా నైపుణ్యాలను పెంచుతాయి. రీడింగ్, మ్యాథ్, సైన్స్‌లలో మెరుగైన సామర్థ్యాన్ని కనబర్చడంలోనూ ఇది పరోక్షంగా మేలు చేస్తున్నదని అధ్యయం స్పష్టం చేసింది. ఫ్లోరిడా విశ్వవిద్యాలయానికి చెందిన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫుడ్ అండ్ అగ్రికల్చరల్ సైన్సెస్ ద్వారా వెలువడిన అధ్యయనాలు కూడా ఫ్యామిలీ మీల్స్ లేదా ఫ్యామిలీ డిన్నర్లు పిల్లల అకడమిక్ పనితీరును మెరుగు పరుస్తాయని, హోమ్‌వర్క్‌పై ఫోకస్, రీడింగ్ ఇంట్రెస్ట్‌ను పెంచుతాయని చెబుతున్నాయి. ముఖ్యంగా తండ్రి సమక్షంలో ఉండటం, మాట్లాడటం, మోటివేషన్ పొందడం వంటివి పిల్లల భావోద్వేగ అభివృద్ధిలో కీ రోల్ పోషిస్తాయి. ఇది వారి అకడమిక్ ప్రతిభకు, భావోద్వేగ స్థిరత్వానికి, మానసిక వికాసానికి సహాయపడుతుంది. అయితే అధ్యయనం కేవలం తండ్రితో కలిసి డిన్నర్ చేసే సంతానంపై ఫోకస్ చేసింది. కానీ తల్లి సమక్షంలో లేదా తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులందరి సమక్షంలో కలిసి డిన్నర్ చేయడం కూడా పిల్లల్లో మెరుగైన భావోద్వేగ సామర్థ్యాన్ని, తెలివితేటలను పెంచుతాయని నిపుణులు అంటున్నారు.

# ఐపీఎల్ నుంచి తప్పుకున్న ఢిల్లీ క్యాపిటల్స్ ప్లేయర్.. బెన్ డకెట్‌పై 3 ఏళ్ల నిషేధం!



మరో నాలుగు రోజుల్లో ప్రారంభం కానున్న ఐపీఎల్ 2026 సీజన్‌కు ముందు ఢిల్లీ క్యాపిటల్స్ జట్టుకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఇంగ్లాండ్ డాషింగ్ ఓపెనర్ బెన్ డకెట్ వ్యక్తిగత కారణాలతో ఈ ఏడాది ఐపీఎల్‌కు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నారు. వేలంలో ఢిల్లీ క్యాపిటల్స్ ఆయనను రూ. 2 కోట్లకు దక్కించుకుంది. కేఎల్ రాహుల్‌తో కలిసి బెన్ డకెట్ ఇన్నింగ్స్‌ను ప్రారంభిస్తారని అభిమానులు ఆశించారు. కానీ, టోర్నీ ప్రారంభానికి కేవలం నాలుగు రోజుల ముందు అతడు ఈ సంచలన నిర్ణయం తీసుకున్నారు.ఇది చాలా కష్టమైన నిర్ణయం.. ఢిల్లీ ఫ్రాంచైజీకి నేను క్షమాపణలు చెబుతున్నాను.. వేలంలో నన్ను ఢిల్లీ లాంటి గొప్ప జట్టు ఎంచుకోవడం చాలా ఆనందాన్ని ఇచ్చిందని బెన్ డకెట్ వెల్లడించారు. ఐపీఎల్ ప్రపంచంలోనే అత్యుత్తమ టోర్నీ, అక్కడ ఆడటం గొప్ప అనుభూతినిస్తుంది.. కానీ నా కెరీర్ దృష్ట్యా ప్రస్తుతానికి ఇది సరైన నిర్ణయమని నేను భావిస్తున్నాను.. భవిష్యత్తులో ఎప్పుడైనా ఢిల్లీ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తానని ఆశిస్తున్నాను అని తన సోషల్ మీడియా అకౌంట్ లో బెన్ డకెట్ వెల్లడించారు. ఐపీఎల్ నిబంధనల ప్రకారం, బెన్ డకెట్ లీగ్ నుంచి మూడేళ్ల నిషేధాన్ని ఎదుర్కోవచ్చు అనే ప్రచారం జరుగుతుంది. టోర్నమెంట్‌కు ముందే ఆటగాళ్లు తప్పుకోవడం, ఫ్రాంచైజీలను ఇబ్బందుల్లోకి నెట్టడం వంటి పలు ఘటనలతో బీసీసీఐ విదేశీ ఆటగాళ్లపై ఈ నిబంధనను అమలు చేసింది. రూ. 4 కోట్లకు ఢిల్లీ క్యాపిటల్స్‌తో ఒప్పందం కుదుర్చుకున్నప్పటికీ, గత సీజన్‌లో జట్టు నుంచి వైదొలగిన ఇంగ్లాండ్ కెప్టెన్ హ్యారీ బ్రూక్ ఈ నిబంధనకు బలి అయిన మొదటి వ్యక్తిగా నిలిచాడు.

# రింకూ సింగ్‌కు ప్రమోషన్... వైస్ కెప్టెన్‌గా నియమించిన కేకేఆర్



ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2026 సీజన్‌కు ముందు కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) కీలక ప్రకటన చేసింది. తమ జట్టు స్టార్ బ్యాటర్, ఫినిషర్ అయిన రింకూ సింగ్‌ను వైస్ కెప్టెన్‌గా నియమిస్తున్నట్లు అధికారికంగా వెల్లడించింది. రాబోయే సీజన్‌లో వెటరన్ ఓపెనర్ అజింక్యా రహానే కెప్టెన్‌గా వ్యవహరించనుండగా, అతనికి డిప్యూటీగా రింకూ బాధ్యతలు చేపట్టనున్నాడు. తన విధ్వంసకర బ్యాటింగ్, అద్భుతమైన ఫీల్డింగ్‌తో జట్టులో ముఖ్య ఆటగాడిగా మారిన 28 ఏళ్ల రింకూకు, దేశవాళీ క్రికెట్‌లో నాయకత్వం వహించిన అనుభవం కూడా ఉంది.ఈ నియామకంపై కేకేఆర్ సీఈఓ వెంకీ మైసూర్ మాట్లాడుతూ, “ఫ్రాంచైజీ తరఫున, రింకూ సింగ్‌ను వైస్ కెప్టెన్‌గా ప్రకటించడం మాకు చాలా సంతోషంగా ఉంది. రింకూ 2018లో కేకేఆర్‌లో చేరాడు. అప్పటి నుంచి జట్టులో రెగ్యులర్ సభ్యుడిగా కొనసాగుతూ తనను తాను నిరూపించుకున్నాడు” అని తెలిపారు.

ఐపీఎల్ 2026 సీజన్‌లో కేకేఆర్ తమ తొలి మ్యాచ్‌ను మార్చి 29న ముంబైలోని వాంఖడే స్టేడియంలో ఐదుసార్లు ఛాంపియన్ అయిన ముంబై ఇండియన్స్‌తో ఆడనుంది. ఇక తమ సొంత మైదానం కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో ఏప్రిల్ 2న 2016 విజేత సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో తొలి మ్యాచ్ ఆడనుంది. ఆ తర్వాత ఏప్రిల్ 6న పంజాబ్ కింగ్స్, ఏప్రిల్ 9న లక్నో సూపర్ జెయింట్స్‌తో తలపడనుంది.ఇదిలా ఉండగా, కేకేఆర్ జట్టును గాయాల బెడద వేధిస్తోంది. యువ పేసర్ హర్షిత్ రాణా గాయం కారణంగా జట్టుకు దూరమయ్యాడు. అతని స్థానంలో సరైన ఆటగాడిని ఎంపిక చేసేందుకు కేకేఆర్ తమ ప్రీ-సీజన్ క్యాంప్‌లో ట్రయల్స్ నిర్వహిస్తోంది. ఈ ట్రయల్స్‌కు నవదీప్ సైనీ, ఆకాశ్ మధ్వాల్, సిమర్‌జీత్ సింగ్, సందీప్ వారియర్, కేఎం ఆసిఫ్, సునీల్ కుమార్ వంటి పేసర్లు హాజరవుతున్నారు. అంతకుముందు, మరో భారత పేసర్ ఆకాశ్ దీప్ వెన్నునొప్పి కారణంగా టోర్నమెంట్ మొత్తానికి దూరమయ్యాడు. అతని స్థానంలో కేకేఆర్ విదర్భ పేసర్ సౌరభ్ దూబేను జట్టులోకి తీసుకుంది. 28 ఏళ్ల దూబే 2022లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు ఎంపికైనా గాయం కారణంగా ఆడలేకపోయాడు. గత మినీ వేలంలో అమ్ముడుపోని అతను, రిజిస్టర్డ్ అవైలబుల్ ప్లేయర్ పూల్ (=ూ్రూ) నుంచి కేకేఆర్ జట్టులోకి వచ్చాడు. దూబే ఇప్పటివరకు ఐపీఎల్‌లో అరంగేట్రం చేయలేదు. అతను విదర్భ తరఫున 8 లిస్ట్-ఎ మ్యాచ్‌లు, 3 టీ20లు ఆడాడు. 2019లో భారత-ఎ జట్టుకు కూడా ప్రాతినిధ్యం వహించాడు. కొత్త నాయకత్వ బాధ్యతలు, కీలక ఆటగాళ్ల గాయాల నడుమ కేకేఆర్ ఈ సీజన్‌కు సిద్ధమవుతోంది.

# రికార్డు ధరకు అమ్ముడైన ఆర్సీబీ ఫ్రాంచైజీ... కొత్త ఓనర్లు వీళ్లే!

- ఆర్సీబీ ఫ్రాంచైజీని దక్కించుకున్న ఆదిత్య బిర్లా, టైమ్స్ గ్రూప్ కన్సార్టియం
- సుమారు రూ. 16,725 కోట్లకు జరిగిన ఈ భారీ ఒప్పందం
- పురుషుల, మహిళల జట్ల యాజమాన్య హక్కుల బదలాయింపు
- కొత్త చైర్మన్‌గా ఆర్యమన్ విక్రమ్ బిర్లా, వైస్ చైర్మన్‌గా సత్యన్ గజ్వానీ




ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) ఫ్రాంచైజీ చేతులు మారింది. ఆదిత్య బిర్లా గ్రూప్, టైమ్స్ ఆఫ్ ఇండియా గ్రూప్ నేతృత్వంలోని కన్సార్టియం ఈ జట్టును 1.78 బిలియన్ డాలర్లకు (సుమారు రూ. 16,725 కోట్లు) కొనుగోలు చేసినట్లు వెల్లడైంది. ఆదిత్య బిర్లా, టైమ్స్ గ్రూప్‌లతో పాటు బోల్ట్ వెంచర్స్, బ్లాక్‌స్టోన్ సంస్థలు ఈ కన్సార్టియంలో భాగస్వాములుగా ఉన్నాయి. ఆర్సీబీ ఫ్రాంచైజీలో 100 శాతం వాటాను కొనుగోలు చేసేందుకు యునైటెడ్ స్పిరిట్స్ లిమిటెడ్ (యూఎస్ఎల్)తో ఈ కన్సార్టియం ఒప్పందం కుదుర్చుకున్నట్లు సమాచారం. ఈ డీల్‌లో ఐపీఎల్ పురుషుల జట్టుతో పాటు, ఉమెన్స్ ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) మహిళల జట్టు కూడా ఉన్నాయి. కొత్త యాజమాన్యంలో భాగంగా ఆదిత్య బిర్లా గ్రూప్ డైరెక్టర్ ఆర్యమన్ విక్రమ్ బిర్లా చైర్మన్‌గా, టైమ్స్ ఆఫ్ ఇండియా గ్రూప్‌కు చెందిన సత్యన్ గజ్వానీ వైస్ చైర్మన్‌గా వ్యవహరించనున్నారు. అయితే, ఈ కొనుగోలుకు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ), ఐపీఎల్, డబ్ల్యూపీఎల్ పాలకమండలుల నుంచి అధికారిక అనుమతులు లభించాల్సి ఉంది. కొన్ని నెలల క్రితం ఆర్సీబీ మాతృసంస్థ డయాజియో పీఎల్‌సీ ఈ ఫ్రాంచైజీని అమ్మకానికి పెట్టింది. కాగా, ఒకే సమయంలో ఐపీఎల్ (2025), డబ్ల్యూపీఎల్ (2026) టైటిళ్లను గెలుచుకున్న ఏకైక ఫ్రాంచైజీగా ఆర్సీబీకి ప్రత్యేక గుర్తింపు ఉంది. గతంలో విజయ్ మాల్యా ఈ ఫ్రాంచైజీని సొంతం చేసుకోగా, యునైటెడ్ స్పిరిట్స్ సంస్థను డయాజియో టేకోవర్ చేయడంతో ఆర్సీబీ యాజమాన్య హక్కులు బదిలీ అయ్యాయి.



వెడ్డింగ్ సెలబ్రేషన్‌లో రోజ్ గోల్డ్ లెహంగాలో మేఘనా కౌర్ స్టన్స్

# ట్రెండీ టాక్: ఇకపై పెద్దతెర-బుల్లితెరకు స్టార్లతో పనే లేదు!

ఇకపై పెద్దతెర- బుల్లితెర స్టార్ల ఉద్యోగాలు ఊస్టింగ్ అవ్వబోతున్నాయా? నటీనటులకు భారీ పారితోషికాలు చెల్లించి కాల్షీట్లు కొనుక్కోవాల్సిన పరిస్థితి ఉండదా? అంటే.. అవుననే తాజా సాంకేతికత నిరూపిస్తోంది. ఆర్జీవీ అలియాస్ రామ్ గోపాల్ వర్మ హెచ్చరికలు నిజం అవ్వడానికి ఇంకెంతో సమయం పట్టదని తాజా పరిస్థితులు చెబుతున్నాయి. ఏఐ బొమ్మ లేదా యానిమేటెడ్ బొమ్మ అని తీసిపారేయడానికి లేదు. చూస్తుండగానే అంతా మారిపోతోంది. శంకర్ -జీన్స్-లో వర్చువల్ ఐశ్వర్యారాయ్ ని చూపించినప్పుడు గొప్ప ఆశ్చర్యం వ్యక్తం చేసినవారు.. ఇకపై మానవ ప్రపంచంలో సంచరించే వర్చువల్ నటీనటులను చాలా సాధారణంగా తీసుకునే ఛాన్సుందని అంచనా. భవిష్యత్ లో నటీనటులను పూర్తిగా కృత్రిమ మేధస్సుతోనే తయారు చేస్తారనే సంకేతాలు బలంగా ఉన్నాయి. ఇది కేవలం యాంకరింగ్ వరకే పరిమితం కాదు... బుల్లితెర, పెద్ద తెరకు స్టార్లను సరఫరా చేయడానికి ఏఐ చాలా సహకరించబోతోంది. భారతీయ బుల్లితెర చరిత్రలో సరికొత్త అధ్యాయం మొదలుకాబోతోంది. సాంకేతిక పరిజ్ఞానం అంచులను తాకుతూ.. మనుషులకు దీటుగా నటించేందుకు -నైనా ఏవిటిఆర్- అనే ఏఐ బ్యూటీ సిద్ధమైపోయింది. ఇప్పటికే నైనా నటించిన కొన్ని వీడియోలు, డ్యాన్స్ వీడియోలు, మోడలింగ్ అసైన్ మెంట్లకు సంబంధించిన ఇన్ స్టా వీడియోలు ఇంటర్నెట్ ని కుదిపేస్తున్నాయి. దీనిని నిశితంగా గమనిస్తే... నైనా కేవలం ఒక యానిమేషన్ బొమ్మ మాత్రమే కాదు.. అత్యంత అధునాతనమైన -మెషిన్ లెర్నింగ్- మోషన్ క్యాప్చర్ టెక్నాలజీల మేళవింపుతో సృష్టించిన ఒక అద్భుత దృశ్య కావ్యం. ఈ సరికొత్త టెక్నాలజీ వల్ల నైనా అనే పాత్రధారి కదలికలు, ప్రవర్తన అచ్చం నిజమైన నటిని తలపిస్తూ ప్రేక్షకులను మాయ చేస్తున్నాయి. నైనాను ఇంత రియలిస్టిక్‌గా చూపించడం వెనుక -హై-ఎండ్ గ్రాఫిక్స్ రెండరింగ్- సాంకేతికత కీలక పాత్ర పోషించింది.



ఆమె చర్మం రంగు, జుట్టు గాలికి ఊగే విధానం, కళ్లలోని సహజమైన మెరుపును గమనిస్తే ఈ బ్యూటీ ఒక వర్చువల్ క్యారెక్టర్ అని నమ్మడం కష్టంగా ఉంది. సాధారణ ఏఐ బొమ్మల్లో ముఖ కవళికలు కృత్రిమంగా, బిగుతుగా ఉంటాయి. కానీ నైనా విషయంలో కోపం, సంతోషం, బాధ వంటి సున్నితమైన ఎమోషన్లను పలికించిన తీరు ఆశ్చర్యపరుస్తోంది. ఈ ఎమోషన్స్ ని పలికించడం కోసం సుమారు 50కి పైగా ఫేషియల్ మ్యాపింగ్ పాయింట్స్ ను వాడారు. అందుకే ఆమె పలికించే హావభావాలు ఆ కిల్లింగ్ లుక్స్ ప్రేక్షకులకు చాలా సహజంగా అనిపిస్తున్నాయి. ఇక నైనా ప్రధాన పాత్రలో రాబోతున్న బుల్లితెర సీరియల్ గురించి పరిశ్రమ వర్గాల్లో భారీ చర్చ సాగుతోంది. బుల్లితెరపై సరికొత్త చరిత్ర సృష్టించబోతున్న ఈ ధారావాహిక 2026 మే నెల చివరి వారంలో లేదా జూన్ మొదటి వారంలో గ్రాండ్‌గా లాంచ్ కాబోతోందని సమాచారం. ప్రముఖ ఎంటర్‌టైన్‌మెంట్ ఛానల్ స్టార్ ప్లస్ లో ఈ వినూత్న ప్రయోగం ప్రసారం కానుందని టాక్ వినిపిస్తోంది. ఒక ఏఐ నటి పూర్తిస్థాయి లీడ్ రోల్‌లో కనిపించడం ఇదే మొదటిసారి కావడంతో అభిమానులు ఈ తేదీ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.ఈ సీరియల్ ఒక ప్రయోగాత్మక, గ్లామరస్ యాక్షన్ థ్రిల్లర్ కావడంతో దీనిని ప్రైమ్ టైమ్ అయిన రాత్రి 8 నుండి 10 గంటల మధ్య స్లాట్‌లో ప్రసారం చేసేందుకు ఛానల్ యాజమాన్యం మొగ్గు చూపుతున్నట్టు కథనాలొస్తున్నాయి. ఇందులో నైనా ఒక వర్చువల్ ఏజెంట్‌గా లేదా సూపర్ హ్యూమన్ శక్తి ఉన్న పాత్రలో కనిపిస్తుందని సమాచారం. సమాజంలోని నేరాలను తన స్టైలిష్ మూవ్స్‌తో.. అసాధారణ తెలివితేటలతో ఎలా అడ్డుకుంటుంది? అనేదే ఈ సీరియల్ ప్రధాన కథాంశం. ఈ యాక్షన్ ప్యాక్డ్ డ్రామా బుల్లితెరపై ఒక కొత్త అనుభూతిని ఇస్తుందని మేకర్స్ నమ్ముతున్నారు. ఇక సీరియల్ ప్రారంభం కాకముందే నైనా సోషల్ మీడియాలో ఒక పెద్ద సెన్సేషన్‌గా మారింది. ఇన్‌స్టాగ్రామ్‌లో ఈ భామకు ఇప్పటికే లక్షలాది మంది ఫాలోయర్స్ ఉన్నారు. తను పోస్ట్ చేసే ప్రతి రీల్.. ప్రతి కిల్లింగ్ మూవ్ నెట్టింట నిమిషాల్లో వైరల్ అవుతోంది. విశేషమేమిటంటే ఒక ఏఐ మోడల్ అయి ఉండి కూడా తన గ్లామర్‌తో పెద్ద పెద్ద బ్రాండ్‌ల దృష్టిని ఆకర్షించి -బ్రాండ్ ఎండార్స్‌మెంట్స్- కూడా దక్కించుకుంటోంది. మనుషులతో సమానంగా క్రేజ్ సంపాదించుకోవడం నైనా సాధించిన పెద్ద విజయం.

PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com